ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

మంగళవారం 12 ఆగస్టు 2025

మిషన్ భగీరథ టీఆర్‌డబ్ల్యూఎస్‌ఈఏ సిరిసిల్ల సర్కిల్ కార్యవర్గం..

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా మిషన్ భగీరథ టీఆర్‌డబ్ల్యూఎస్‌ఈఏ సిరిసిల్ల సర్కిల్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి హారిక తెలిపారు. సిరిసిల్ల జిల్లాలో జరిగిన సమావేశంలో నూతన అధ్యక్షులుగా విశ్వన్, ఉపాధ్యక్షులుగా అభిషేక్, ప్రధాన కార్యదర్శిగా రామరావు, సహాయ కార్యదర్శిగా హరిప్రియ, టెక్నికల్ కార్యదర్శిగా శ్రీమాన్, మహిళా కార్యదర్శిగా శ్రావ్యపటేల్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మధు, కోశాధికారిగా సాయికిరణ్‌లను ఎన్నుకున్నారు.

సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష సమావేశం

- హాజరైన ప్రభుత్వ విప్, నీటిపారుదల శాఖ అధికారులు



సమీక్ష సమావేశంలో పాల్గొన్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వేములవాడ నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై హైదరాబాద్‌లో నీటి పారుదల శాఖ అధికారులతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశం వివరాలను ఒక ప్రకటనలో వెల్లడిస్తూ కలికోట సూరమ్మ చెరువు రిజర్వాయర్ పనులను, రిజర్వాయ నుంచి వెళ్లే కుడి ఎడమ కాల్వల నిర్మాణ పనులు, మల్కాపేట రిజర్వాయర్ ఎడమ కాలువ కోసం భూ సేకరణ, వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి ప్రాజెక్టు పనులు, కోనరావుపేట మండల పరిధిలోని లచ్చాపేట తండా రిజర్వాయర్ కాలువ పనులు, చందుర్తి మండల పరిధిలోని ఆశిరెడ్డిపల్లి కొచ్చేరువు, సనుగుల ఎర్ర చెరువు, పటేల్ చెరువులోకి నీటితో నింపే ఏర్పాట్లు తదితర అంశాలపై చర్చించినట్లు తెలిపారు. ప్రాధన్యతను దృష్టిలో పెట్టుకుని, రైతులకు సాగునీరు సకాలంలో అందించేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సంబంధిత అధికారులకు సూచించారు. ప్రాజెక్టుల నిర్మాణ పనుల పురోగతి సమీక్షిస్తూ, ఎలాంటి ఆలస్యం చేయకుండా నాణ్యతతో పనులు పూర్తి చేయాలని సూచించారు. రైతుల అవసరాలన దృష్టిలో పెట్టుకుని వలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టుల అమలులో పారదర్శకత పాటించడంతో పాటు, వ్యవసాయ ఉత్పాదకత పెరగడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. ఈ సందర్భంగా నీటిపారుదల అధికారులను ప్రాజెక్టుల ప్రస్తుత స్థితిగతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో నీటి పారుదల సీఈ సుధాకర్‌రెడ్డి, ఈఈ సంతుప్రకాశ్ తదితరులు ఉన్నారు.

పత్తిపంట సాగులో జాగ్రత్తలు తీసుకోవాలి

ఇల్లంతకుంట, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి) : ప్రత్తిపంటను సాగుచేసిన రైతులు రసంపీల్చే, ఆకుమచ్చ తెగలు వ్యాపిస్తున్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ పరిశోధనస్థానం ప్రధాన శాస్త్రవేత్త రామ్‌ప్రసాద్ సూచించారు. మండలంలోని గాలిపెల్లి, నర్సక్కపేట, పొత్తూరు గ్రామాలలో సోమవారం ఏరువాక కేంద్ర వ్యవసాయ శాస్త్రవేత్తలు పంటచేలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తిచేనులో తెగుళ్ల నివారణకు ప్రోపీకోనజోల్ 200ఎమ్ఎల్ ఎకరానికి పిచికారి చేయాలని సూచించారు. ఏరువాకకేంద్ర కోఆర్డినేటర్ మదన్‌మోహన్‌రెడ్డి, వ్యవసాయ శాస్త్రవేత్త ఉషారాణి, వ్యవసాయాధికారి సురేష్ రెడ్డి, ఏఈవోలు అర్చన, లలిత, వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

హరహర మహాదేవా.. శంభో శంకరా..

- భక్తజన సంద్రంగా రాజన్న క్షేత్రం



భక్తులతో కిక్కిరిసిన రాజన్న ఆలయం

7

ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

8

- పేరుకుపోయిన భూభారతి దరఖాస్తులు
- జిల్లాలో 8,926 దరఖాస్తులు.. పరిష్కారమైనవి 2682..
- ఈనెల 15 వరకే పరిష్కారానికి గడువు

మిగిలింది మూడు రోజులే..!



(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

భూముల చిక్కులను పరిష్కరించే దిశగా ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తెచ్చింది. గత ప్రభుత్వం తెచ్చిన 'ధరణి అనేక లోపాలతో ప్రయోజనకరంగా లేదని ప్రస్తుత ప్రభుత్వం భూ భారతిని తెచ్చింది. భూభారతి అమలులో భాగంగా క్షేత్రస్థాయిలో గ్రామాల వారిగా భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అంతేకాదు ఆగస్టు 15వ తేదిలోగా వచ్చిన సమస్యలను పరిష్కరించాలని లక్ష్యంగా ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ప్రభుత్వం విధించిన గడువు మూడు రోజులే మిగిలింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో భూభారతి సదస్సులో 8926 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో ఇప్పటివరకు నామమాత్రంగానే పరిష్కారం జరిగింది. దీంతో భూభారతి దరఖాస్తులు పరిశీలన గడువు పెంచక తప్పదని తెలుస్తోంది. అధికారుల బృందం క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి వెళ్లినప్పుడు అనేక చిక్కులను ఎదుర్కోవాల్సి వస్తోంది. మిస్సింగ్ సర్వే నంబర్లు, ఒక సర్వే నంబర్లలో మరొకరు ఉండడం, రైతులు రెవెన్యూ భూ భూములగా చెప్పడం, అటవీ భూములుగా రికార్డుల్లో ఉండడం వంటి సమస్యలు కూడా ఉన్నాయి. ప్రధానంగా పీవోటీలు, సాదా బైనామాలు, మిస్సింగ్ సర్వే నంబర్‌లపై క్షేత్రస్థాయిలో అధికారులకు ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లుగా తెలుస్తోంది. భూసమస్యల పరిష్కారంలో సిబ్బంది కొరత కూడా సమస్యగానే ఉన్నట్లుగా తెలుస్తోంది. కొన్ని సమస్యలు వెంటనే పరిష్కరించడం అసాధ్యంగా ఉన్నట్లు ఉద్యోగులు భావిస్తున్నారు.

● ఇప్పటికి 2682 దరఖాస్తుల పరిష్కారం

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 13మండలల్లోని 171 రెవెన్యూ గ్రామాల పరిధిలో సదస్సులు నిర్వహించగా, భూ సమస్యలపై 8926మంది దరఖాస్తులు చేసుకున్నారు. వీటిలో 2682 దరఖాస్తులు మాత్రమే పరిష్కారమయ్యాయి. ఇందులో కేవలం18 దరఖాస్తులకు సంబంధించి ప్రొసీడింగ్‌లు అందించారు. 2664 దరఖాస్తులను పరిష్కరించి ప్రొసీడింగులు అందించడానికి సిద్ధం చేశారు. ఇందులో భూభారతి దరఖాస్తుల్లో మిస్సింగ్ సర్వే నంబర్లకు సంబంధించి 1393 దరఖాస్తులు, పెండింగ్ మ్యుటేషన్‌కు 295 దరఖాస్తులు, డీఎస్ పెండింగ్‌లో 404 దరఖాస్తులు వచ్చాయి. భూమివిస్తీర్ణం, చేర్పులు మార్పులు సంబంధించి 2093 దరఖాస్తులు వచ్చాయి. నిషేధిత జాబితాలో భూములు నమోదు అయినట్లు సవరించడానికి 270 దరఖాస్తులు వచ్చాయి. అసైన్డ్ భూములు, భూసేకరణ, ఇతరరికార్డులకు సంబంధించిన సమస్యలపై 3489 దరఖాస్తులు వచ్చాయి.

● 1675 సాదాబైనామా దరఖాస్తులు

రాజన్న సిరిసిల్లలో రైతులు దాదాపు 10 ఏళ్లగా సాదా బైనామాల సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. సాదా బైనామాల పరిష్కారం పేరిట గత ప్రభుత్వం 2016లో జీవో నంబర్ 153 తీసుకువచ్చింది. 2014 జూన్ 2వతేదీ ముందు సాదా బైనామాలతో భూములు కొనుగోలు చేసిన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. చట్టబద్ధత కల్పించాలని భావించారు. ఇందుకోసం 2020 అక్టోబర్ 12న జీవో నెంబర్ 112 జారీచేసింది. దీనికి సంబంధించి మంత్రివర్గ ఉప సంఘాన్ని కూడా ఏర్పాటు చేసింది. సాదా బైనామాలపై తాహసీల్దార్‌లకు అధికారాలు ఇచ్చిన మార్గదర్శకాలు ఇవ్వకపోవడంతో సమస్యలు మాత్రం పరిష్కరించలేదు. సాదాబైనామాలకు చట్టబద్ధత కల్పించి క్రమబద్ధీకరిస్తామని గత ప్రభుత్వం ప్రకటించినా అచరణలోకి రాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం తెల్లకాగితం ఒప్పందాలకు చట్టబద్ధత కల్పించాలని తెలంగాణ భూభారతి ...

మిగతా 8లో

ఏదయా.. యూరియా..

- తెల్లవారుజాము నుంచే విక్రయ కేంద్రాల వద్ద బారులు...
- లభించక వెనుదిరిగిన రైతులు
- సరిపడా ఇవ్వాలని వేడుకోలు



ఎల్లారెడ్డిపేటలోని గోదాం వద్ద ఎదురుచూస్తున్న రైతులు



ఇల్లంతకుంటలో యూరియా కోసం బారులు తీరిన రైతులు



చందుర్తిలో బారులు తీరిన రైతులు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు వెంకటాపూర్, రాచర్లతిమ్మాపూర్, అల్మాస్‌పూర్ గ్రామాల్లోని గోదాంల వద్ద సోమవారం యూరియా కోసం రైతులు ఎదురు చూశారు. యూరియా బస్తాలు వచ్చాయనే సమాచారంతో ఉదయం నుంచే రైతులు బారులు తీరారు. బస్తాల కోసం ఎగబడ్డారు. రైతుల మధ్య స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని వరుసలో నిలబెట్టారు. చివరి వరకు ఉన్న తమకు యూరియా లభించకపోవడంతో నిరాశతో వెనుదిరిగామని రైతులు వాపోయారు. ఎల్లారెడ్డిపేట, వెంకటాపూర్, రాచర్లతిమ్మాపూర్, అల్మాస్‌పూర్ ఐకేపీ, ప్యాక్స్ ఆధ్వర్యంలోని గోదాంలకు సోమవారం 65 మెట్రిక్ టన్నుల యూరియా చేరుకుందని వ్యవసాయ అధికారి రాజశేఖర్ పేర్కొన్నారు. ముందు వరసలో ఉన్న రైతులు ఎక్కువ సంఖ్యలో బస్తాలు తీసుకోవడం వల్ల చివరి రైతులకు అందలేదని చెప్పారు. యూరియా సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతామని ఏవో రాజశేఖర్ వివరించారు.

● ఇల్లంతకుంట : యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండలకేంద్రంలోని సహకార సంఘ కార్యాలయం, పెద్దలింగాపూర్, ముస్కానిపేట, పొత్తూరు గ్రామాలలో విక్రయ కేంద్రాలకు యూరియా వచ్చిందని తెలుసుకున్న రైతులు సోమవారం ఉదయమే చేరుకున్నారు. కేంద్రాలు ప్రారంభించక ముందే రైతులు క్యూ కట్టారు. యూరియా బస్తాలు తక్కువగా ఉండటం రైతులు ఎక్కువ మంది రావడంతో నిర్వాహకులు ఇబ్బంది పడ్డారు. ప్రతి ఆధార్‌కార్డుకు కేవలం రెండు యూరియా బస్తాలు మాత్రమే ఇస్తామని సిబ్బంది, వ్యాపారులు నిబంధనలు విధించారు. రైతులు ఎక్కువ మంది రావడంతో సమాచారం అందుకున్న పోలీసులు కేంద్రాలకు చేరుకొని రైతులకు నచ్చజెప్పారు. కొన్ని గ్రామాలలో ప్రైవేట్ వ్యాపారులు సేంద్రియ ఎరువు బస్తాలు, పోషకాలు పెంచే బయోజన్ అనే లిక్విడ్‌ను కొనుగోలుచేస్తేనే యూరియా బస్తాలు ఇస్తామనే నిబంధనలు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. యూరియా కోసం రైతులు పడుతున్న ఇబ్బందులపై వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి మాట్లాడుతూ ఎవరు ఆందోళన చెందవద్దన్నారు. నాలుగు రోజుల్లో సరిపడా యూరియా వస్తుందన్నారు. అపోహలు నమ్మి అవసరం లేకున్నా రైతులు యూరియా కొనుగోలు చేయవద్దన్నారు. వ్యాపారులు ఎలాంటి నిబంధనలు విధించవద్దన్నారు.

● చందుర్తి : అధికారులు ఒకవైపు యూరియా కొరత లేదని చెప్తున్నా మండల కేంద్రంతోపాటు సనుగుల గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఎదుట రైతులు సోమవారం తెల్లవారుజామున నుంచే బారులు తీరారు. మండలంలోని చందుర్తి, సనుగుల పీఏసీఎస్‌లో సోమవారం యూరియా పంపిణీ చేపట్టారు. అయితే యూరియా దొరుకుతుందో లేదో అన్న సందేహంతో రైతులు ఉదయం 6 గంటలకు చేరుకుని తమ చెప్పులను క్యూలైన్‌లో పెట్టారు. సిబ్బంది ఒక్కో రైతుకు ఒకటి, రెండు బస్తాల చొప్పున చందుర్తి, సనుగుల సొసైటీలో 888బస్తాలను 306 మందికి రైతులకు అందించారు. సరిపడా యూరియా అమ్మేలా ఏర్పాట్లు చేయాలని రైతులు కోరుతున్నారు. చందుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి సోమవారం సాయంత్రం 444బస్తాల యూరియా వచ్చినట్లు సీఈవో తెలిపారు. చందుర్తి ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కాగా మండల కేంద్రంతోపాటు మల్యాల, మర్రిగడ్డ,సనుగుల గ్రామంలోని ప్రైవేట్ వ్యాపారులు యూరియాను రూపాయలు 300నుంచి 350వరకు విక్రయించినట్లు రైతులు వాపోయారు. కొంతమంది బడా రైతులు ముందస్తుగానే ఒక్కొక్క రైతు 60బస్తాల పైగా నిల్వ చేసుకోవడం వల్లనే యూరియా కొరత ఏర్పడిందని ఆరోపిస్తున్నారు. ప్రైవేటు వ్యాపారులు అధిక ధరలకు విక్రయించకుండా, బ్లాక్ మార్కెట్‌కు తరలించకుండా అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



సనుగులలో బారులు తీరిన రైతులు

● కోనరావుపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు పడికాపులు కాస్తున్నారు. అధికారులు మాత్రం యూరియా కొరతలేదని చెప్తున్నారు. అయినప్పటికీ యూరియా కోసం రైతులు బారులు తీరుతున్నారు. కోనరావుపేట మండలంలోని కొలనూరు సింగిల్ విండో కార్యాలయానికి నిజామాబాద్ మార్కెట్ కమిటీ కార్యాలయానికి 250 బస్తాల చొప్పున యూరియా వచ్చింది. యూరియా వచ్చిందని తెలుసుకొని రైతులు బారు తీరడంతో యూరియా సరిపోక రైతులు వెను తిరిగారు.

రైతులకు యూరియా అందించలేని స్థితిలో ప్రభుత్వం

- బీఆర్ఎస్ నియోజకర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు

వేములవాడ టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా అందించని పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు ఆరోపించారు. నియోజకవర్గంలో యూరియా కొరతపై ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా రైతులు పండించిన పంటకు నీరు అందించకపోగా ఆరుగాలం కష్టపడి సాగు చేసుకున్న పంటకు యూరియా అందించలేని అసమర్థ పాలనను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోందని పేర్కొన్నారు. జిల్లాలో రైతుల అవసరాలకు సరిపడే విధంగా సాగు విస్తీర్ణం, పంటల వివరాలు సేకరించి అవసరమయ్యే ఎరువులపై ముందస్తు ప్రణాళిక రూపొందించాల్సి ఉండగా, అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఒక బస్తా యూరియా కోసం రైతులు గంటల తరబడి అర్ధరాత్రి వరకు వేచి ఉండాల్సిన పరిస్థితులకు కారణమయ్యారని, నాలుగురోజులుగా రైతులు యూరియా కోసం తంటాలు పడుతున్నా పట్టించుకున్న దాఖలాలు లేవని పేర్కొన్నారు. నియోజకవర్గంలో యూరియా కొరతపై రైతులు ఇబ్బందులు పడుతున్నా స్థానిక ఎమ్మెల్యే కలెక్టర్‌తో సమావేశం ఏర్పాటు చేసి యూరియా ఏర్పాటు చేయాల్సిందని వివరించారు. రైరులకు అందించాల్సిన యూరియాపై అంచనా వేయడంలో పూర్తిగా విఫలమయ్యారని, ఫలితంగా సమస్య రోజురోజుకు పెరుగుతోందన్నారు. సోమవారం చందుర్తి, సనుగుల తదితర సొసైటీల వద్ద పోలీసుల పహారా మధ్య యూరియా పంపిణీ చూస్తే కొరత ఉందని తెలుస్తోందన్నారు. చెప్పులను క్యూలో పెట్టి నిలబడి పరిస్థితి మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిందని, రైతులు గత పది సంవత్సరాల కాలంలో ఎరువుల కోసం ఎప్పుడు ఇబ్బందులు పడలేదని కేసీఆర్‌ను రైతులు గుర్తు చేసుకోవడం చూస్తున్నామని తెలిపారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

అధికారులతో రవాణా శాఖ కమిషనర్ సమీక్ష



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని రవాణా శాఖ జిల్లా కార్యాలయంలో సోమవారం రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ సురేంద్రమోహన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్‌తో సమీక్ష నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా జరిగిన కేసుల వివరాలను కమిషనర్ సురేంద్ర మోహన్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్ మాట్లాడుతూ జిల్లాలో ఈ సంవత్సరం ఇప్పటివరకు మొత్తం 293 కేసులు నమోదు చేశామన్నారు. రాష్ట్ర రవాణా శాఖ నిర్ణయించిన 64లక్షల రూపాయలు 100 శాతానికి జిల్లాలో టాక్స్, పెనాల్టీ కాంపౌండింగ్ ఫీ ద్వారా మొత్తం రూ. 96,96,465లకు 151 శాతం వసూలు చేశామని కమిషనర్‌కు వివరించారు. టాక్స్ కట్టని సరుకు రవాణా వాహనాలు, ట్రాక్టర్ ట్రేలర్ ఇతర వాహనాలు 5088 ఉన్నాయని తెలిపారు. సరుకు రవాణా వాహనాలు తప్పని సరిగా బీమా, కాలుష్య నియంత్రణతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలో ఎంవీఐ వంశీధర్, కార్యాలయం నిర్వాహకురాలు కల్పన పాల్గొన్నారు.

గంజాయి రవాణా చేస్తే కఠిన చర్యలు



నిందితులను అరెస్టు చూపుతూ మాట్లాడుతున్న ఏసీపీ రమేష్

మంథని, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గోదారిఖని పోలీసు సబ్ డివిజన్ పరిధిలో అక్రమ సంపాదన, జల్సాల కోసం గంజాయి రవాణా, క్రయ, విక్రయాలు జరిపే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ మడత రమేష్ హెచ్చరించారు. ఎక్లాస్‌పూర్ శివారులోని గాడుదులగండి గుట్ట సమీపంలో గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన మంథనిలోని పోచమ్మవాడకు చెందిన బండారి అభిషేక్ అలియాస్ అంజీ, సూరయ్యపల్లి గ్రామానికిచెందిన కోరవేన రవిసాగర్, ఖానాపూర్ గ్రామానికి చెందిన పుట్ట అలియాస్ కొవ్వూరి అజయ్‌కుమార్‌లను సీఐ కార్యాలయంలో ఏసీపీఆధ్వర్యంలో సోమవారం అరెస్టు చూపారు. అరెస్టు అయిన వారిలో ఇద్దరు మైనర్లు ఉన్నారు. మహారాష్ట్రలోని సిర్వోంచ ప్రాంతంలో కొనుగోలు చేసిన 2.23 కిలోల ఎండు గంజాయి, ఒక బైక్, రెండు కత్తులు, మూడు సెల్‌ఫోన్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఏసీపీ రమేష్ మాట్లాడుతూ.. గోదావరిఖని పోలీసు సబ్ డివిజన్ పరిధిలో గంజాయి రవాణా, ఇతర మత్తు పదార్థాలపై నిఘా పెట్టినట్లు తెలిపారు. మంథని ఎస్ఐ రమేష్ ముగ్గురువ్యక్తులు గంజాయి రవాణా చేస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వీరి విచారణలో మంథని ప్రాంతంలో మరో 20 మంది గంజాయి రవాణా, విక్రయాలు, తాగడం లాంటి అలవాటు చేసుకున్నట్లు గుర్తించామన్నారు. వారిపైన చర్యలు తీసుకుంటామన్నారు. పిల్లలు ఏం చేస్తున్నారో తల్లిదండ్రులు గమనించాలన్నారు. గోదావరిఖని టూటౌన్ సీఐ ప్రసాదరావు, ఎస్ఐ రమేష్‌లు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఈనెల 9న మండలంలోని కాట్రపల్లి గ్రామంలో ఓలారీ అతివేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన ఘటనలో గాయపడిన క్షతగాత్రుడు చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందాడు. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన కొండపర్తి సమ్మయ్య ఈ నెల 9న తన ద్విచక్ర వాహనంపై కాట్రపల్లి నుంచి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో ఓ లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో సమ్మయ్య తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన క్షతగాత్రుడిని కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్సకోసం హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ముస్తాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడని ఎస్సై గణేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గూడెం గ్రామానికి చెందిన పిట్ల దేవయ్య(60) ఆదివారం రాత్రి మద్యంతాగి రోడ్డుపై నిల్చొని ఉండగా అతడి కొడుకు చందు బలవంతంగా తీసుకువచ్చి ఇంట్లో ఉంచాడు. తెల్లారిసరికి పిట్టల దేవయ్య ఇంట్లో చనిపోయి ఉన్నాడని దేవయ్య తమ్ముడు లస్మయ్య ఫిర్యాదు చేశాడు. ఈ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్ అందజేత

కరీంనగర్ క్రైం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం నల్లగుంటపల్లికి చెందిన వడ్లూరి అంజయ్య ఇటీవల తన మొబైల్‌ఫోన్‌ను బొమ్మకల్‌లో పోగొట్టుకొని కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ నిరంజన్‌రెడ్డి ఆదేశాలతో సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా హన్మకొండలో ఉన్నట్లు గుర్తించారు. అనంతరం ఆ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం యజమానిని ఠాణాకు పిలిపించి ఫోన్ అప్పగించారు. ఈ సందర్భంగా ఫోన్‌ను ట్రేస్ చేయడంలో కృషి చేసిన కానిస్టేబుల్ విశ్వతేజను సీఐ అభినందించారు.

గ్రంథాలయం.. విజ్ఞాన భాండాగారం

● నేడు జాతీయ గ్రంథాలయ దినోత్సవం



లైబ్రరీ సైన్స్ పితామహుడిగా రంగనాథన్ సేవలు

గ్రంథాలయాల ప్రాధాన్యం గుర్తించిన రంగనాథన్ లైబ్రరీ సైన్స్ పితామహుడిగా సేవలందించారు. విద్యావేత్తగా పలు రచనలు చేసి, గ్రంథాలయోద్యమంలో కీలక భూమిక పోషించారు. తమిళనాడులో మధ్య తరగతి బ్రాహ్మణ కుటుంబంలో సీతామహాలక్ష్మి-రామామృత అయ్యర్‌కు జన్మించిన ఆయన జీవితాన్ని రచనలు, గ్రంథాలయాల స్థాపనకు ధార పోశారు. ఇంగ్లాండ్‌లో లైబ్రరీ సైన్స్ చదివారు. యూనివర్సిటీలలో లెక్చరర్‌గా, లైబ్రేరియన్‌గా సేవలందించారు. మద్రాసు గ్రంథాలయ సంఘాన్ని స్థాపించడంలో కృషి చేశారు.

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): చదవడం వ్యాయామం వంటిదని ఆంగ్ల వ్యాసకర్త, కవి, నాటక రచయిత జోసెఫ్ అడిసన్ అన్నారు. చద వడంతో మెదడు సామర్థ్యం, పనితీరు మెరుగుపడు తుంది. మస్తిష్క వికాసానికి మంచి సాధనం పుస్తకం. ప్రజల్లో చదివే అలవాటును ప్రోత్సహించడంతోపాటు అక్షరాస్యత, పుస్తకాల ప్రాముఖ్యతపై అవగాహన పెంచడానికి ఏటా ఆగస్టు 12 గ్రంథాలయోద్యమ పితామహుడు శియాలీ రామామృత రంగనాథన్ జన్మదిన సందర్భంగా జాతీయ గ్రంథాలయ దినోత్సవం నిర్వహిస్తున్నారు.

లుక్ కల్చర్ వద్దు.. బుక్ కల్చర్ ముద్దు

డిజిటల్ ఇంటర్నెట్, స్మార్ట్ ఫోన్, గూగుల్ వలలో పడి బుక్ కల్చర్ పోయి లుక్ కల్చర్ వచ్చింది. గ్రంథాలయాలు నిరాదరణకు గురవుతున్నాయి. పుస్తక పఠనం, గ్రంథాలయాల ప్రాముఖ్యత, పుస్తక మహోత్సవాలు, ప్రదర్శన వంటి కార్యక్రమాలు నిర్వహిస్తే మార్పు రావచ్చు.



గ్రంథాలయాలతో లాభాలు

గ్రంథాలయాల్లో పుస్తకాలు చదవడంతో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, కమ్యూనికేషన్ నైపుణ్యాలు మెరుగు పడుతా యి. రచన, పఠన, లేఖనం అలవాటు పెరుగుతుంది. స్పష్టంగా సంభాషించవచ్చు. చరిత్ర, సైన్స్, సాహిత్యం వంటి అంశాలపై సమాచారం లభిస్తుంది. వివిధ విషయాల అన్వేషణ, ప్రపంచం గురించి లోతైన అవగాహనకు వీలు కలుగుతుంది. కొత్త సంస్కృతులను, ఆలోచనలను, దృక్పథాలను పరిశీలిం చవచ్చు.

విమర్శనాత్మక నైపుణ్యాలు, సమస్య పరిష్కార సామర్థ్యాలు, తార్కిక దృష్టి, ఊహ, సృజనాత్మక పెరుగుతాయి. నిద్ర, ఆయుష్షు పెరుగుతుంది. అల్జీమర్ వ్యాధి వచ్చే అవకాశం తక్కువ.

పుస్తక పఠనంలో కీలకం

ఇంట్లో ఉన్న పుస్తకాలు, దిన, వార, మాస పత్రికలు, మ్యాగ్జైన్లతో పాటు గ్రంథాలయాలు పఠనలో కీలక పాత్ర పోషిస్తాయి. కావాల్సిన పుస్తకాలు ఇంటికి తెచ్చుకొని, నచ్చిన అంశాలు, సమాచారాన్ని నోట్ చేసుకొని తిరిగి ఇవ్వవచ్చు. ప్రస్తుతం జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని ప్రతీ రోజూ సుమారు 400 మందికి పైగా, పలు మండలాల్లో 120కి పైగా పాఠకులు సందర్శిస్తున్నారు.

చదువుతో విజ్ఞానం

సత్తు మల్లేశం, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్



చదువుతో విజ్ఞానం, వికాసం లభిస్తాయి. గ్రంథాలయంలో ఎప్పటికప్పుడు కొత్త పుస్తకాలు తెప్పిస్తున్నాం. స్మార్ట్ సిటీ నిధులతో చేపట్టిన నూతన భవన నిర్మాణం త్వరలో పూర్తవుతుంది. పాఠకులు గ్రంథాలయాలను వినియోగించుకోవాలి.

రోజూ వస్తాను

గుంటుకు జితేంద్ర, తాడిజెర్రి



రెండు సంవత్సరాల నుంచి రోజూ గంగాధర మండలం తాడిజెర్రి గ్రామం నుంచి డీసీఎల్‌కు వస్తాను. దిన పత్రికలు, సైన్స్ పుస్తకాలు చదువుతాను. ఎస్ఎస్‌సీ, ఆర్ఆర్‌బీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నాను. ఇక్కడ ప్రశాంతంగా ఉంటుంది.

రెండు ఆలయాల్లో చోరీ

● హుండీలు పగుల గొట్టి నగదు అపహరణ

గంగాధర, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం న్యాలకొండపల్లి శివారులోని వేంకటేశ్వరస్వామి, శివాలయంలో గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టి దొంగతనానికి పాల్పడినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి వేంకటేశ్వర స్వామి ఆలయం, శివాలయాలకు ఎప్పటి మాదిరిగానే ఆలయ ఇన్‌చార్జి మేడిచెల్మల రాజు తాళాలు వేసి వెళ్లారు. సోమవారం ఆలయాలకు వచ్చి చూసేసరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి పరిశీలించగా ఆలయంలోని హుండీలను పగులగొట్టి అందులోని సుమారు 6వేల నగదును ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఆలయ ఇన్‌చార్జి రాజు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మత్తులో డ్రైవర్ వీరంగం

గంగాధర, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మత్తులో విచక్షణ కోల్పోయిన డ్రైవర్ లారీ ఓనర్‌తో గొడవపడి వీరంగం సృష్టించాడు. స్థానికుల కథనం ప్రకారం.. యాపిల్ పళ్ల లోడుతో వచ్చిన లారీ కరీంనగర్ మార్కెట్లో డంపుచేసి తిరుగు పయణమయ్యారు. అయితే మత్తులోఉన్న లారీడ్రైవర్, ఓనర్‌తో గొడవకు దిగాడు. రామడుగు మండలం వెదిరలో ఇద్దరు తగవులాడుకున్నారు. దీంతో సహనం కోల్పోయిన ఓనర్ పోలీస్ స్టేషన్‌ను వెదుక్కుంటూ గంగాధరకు వచ్చాడు. గంగాధర పోలీస్‌స్టేషన్ సమీపంలో మరోమారు గొడవకుదిగారు. దీంతో మత్తులోఉన్న డ్రైవర్‌ను అంబులెన్స్‌లో కరీంనగర్‌కు తరలించినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.

పార్కింగ్ చేసిన కారును ఢీ కొట్టిన మరో కారు

హుజూరాబాద్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని కరీంనగర్ రోడ్‌లోని సబ్‌స్టేషన్ సమీపంలో ఆగి ఉన్న కారును వెనుక నుంచి మరో కారు ఢీ కొట్టింది. దీంతో ఆ కారు ముందు ఉన్న మరో కారును ఢీ కొట్టింది. దీంతో మూడు కార్లు ధ్వంసమయ్యాయి. ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ విషయంపై ఇరువురు పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేశారు. కాగా కరీంనగర్ రోడ్‌లో ఉన్న రెండు హోటళ్ల ముందు వాహనాలు పార్కింగ్ చేస్తుంటారని, దీనిపై పోలీసులు పట్టించుకోవడం లేదని విమర్శలున్నాయి.

గొడవ పడ్డ వ్యక్తుల బైండోవర్

కోల్‌సిటీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని రాజేష్ థియేటర్ పాన్‌షాప్ వద్ద సిగరెట్ తాగే విషయంలో రోడ్డుపై గొడవపడ్డ పలువురు వ్యక్తులను సోమవారం బైండోవర్ చేసినట్టు వన్‌టౌన్ పోలీసులు పేర్కొన్నారు. చిన్నవిషయాలకు రోడ్డుపై పరస్పరం గొడవ పడడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారన్నారు. వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి ఘటన స్థలానికి వెళ్లి గొడవ పడిన వ్యక్తులను అరెస్టు చేశారన్నారు. వారు సత్ప్రవర్తనతో ఉండాలని, భవిష్యత్‌లో గొడవలు పడకుండా బైండోవర్ చేసినట్టు పోలీసులు పేర్కొన్నారు.

బైక్‌ను దొంగలించిన వ్యక్తి అరెస్ట్

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటలో బైక్‌ను దొంగించిన సంఘటనలో సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చిన్నబోనాలకు చెందిన బానోతు తిరుపతిని పట్టుకుని అరెస్ట్ చేశామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి సోమవారం పేర్కొన్నారు. నిందితుడి వద్ద నుంచి ద్విచక్రవాహనాన్ని స్వాధీనపర్చుకున్నామని తెలిపారు. ఎస్ఐ రాహుల్‌రెడ్డి కథనం మేరకు.. మండలంలోని రాచర్లగొల్లపల్లి గ్రామానికి చెందిన ముత్యాల సాయికిరణ్‌కు రాజన్నపేట గ్రామ శివారులో వ్యవసాయ పొలం ఉంది. వ్యవసాయ బోరు మోటారు పని చేయక పోవడం వల్ల మరమ్మతు కోసం తంగళ్లపల్లి మండలం గండిలచ్చపేటలోని మెకానిక్ నీరటి శ్రీనివాస్‌కు సమాచారం అందించాడు. ఆయన ఈనెల 8న తన బైక్‌పై చేరుకుని వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. బోరు మోటారును మరమ్మతు చేసి వాహనం వద్దకు వచ్చే సరికి కనిపించకుండాపోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తిరుపతి ద్విచక్రవాహనాన్ని అపహరించాడని గుర్తించి పట్టుకున్నారు. కోర్టులో హాజరుపర్చడంతో న్యాయమూర్తి 14 రోజుల పాటు జైలుకు తరలించారని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

చట్ట వ్యతిరేక శక్తులపై ఉక్కుపాదం

● మధురానగర్‌లో పోలీసుల కార్డన్ సెర్చ్ ● పత్రాలు లేని 94వాహనాలు సీజ్



మాట్లాడుతున్న ఏసీపీ వెంకటస్వామి

గంగాధర, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఏసీపీ ఎన్ వెంకటస్వామి హెచ్చరించారు. గంగాధర మండలం ప్రధానరహదారిపై మధురానగర్‌లో ఏసీపీ వెంకటస్వామి ఆధ్వర్యంలో విస్తృతంగా కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేస్తూ అనుమానిత వ్యక్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. తనిఖీల్లో భాగంగా సరైన ధ్రువపత్రాలు లేని 91ద్విచక్రవాహనాలు, ఆటో, కారు, ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం చౌరస్తాలో ఏసీపీ వెంకటస్వామి మాట్లాడుతూ సైబర్ మోసాలకు గురైతే 1930 నంబరుకు ఫోన్ చేయాలన్నారు. గంటలోపు ఫోన్ చేస్తే పోగొట్టుకున్న సొమ్మును త్వరగా రికవరీ చేయవచ్చు న్నారు. మాదక ద్రవ్యాలు అక్రమరవాణా, అమ్మకం, వినియోగం చట్టపరంగా నేరమని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రజలు 100లేక స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. డ్రగ్ రహిత సమాజ నిర్మాణంకోసం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా షీటీమ్ సీఐ శ్రీలత సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న మోసాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చొప్పదండి సీఐ ప్రదీప్‌కుమార్, సీఐలు శ్రీలత, కోటేశ్వర్‌రావు, సదన్ కుమార్, సంజీవ్, గంగాధర ఎస్సై వంశీకృష్ణ, ఎస్సైలు నరేంద్రరెడ్డి, యాంటీ నార్కోటిక్ బ్యూరో ఎస్సై పుల్లయ్య, సయ్యద్ అన్వర్, లక్ష్మారెడ్డి, నరేష్, ఇతర పోలీస్ సిబ్బంది, స్థానికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుమారుడి జన్మదినానికి వచ్చి హఠాన్మరణం

● మూడు రోజుల క్రితమే సింగపూర్ నుంచి రాక



మధుకర్‌రెడ్డి(ఫైల్)

కరీంనగర్ క్రైం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తన కొడుకు పుట్టినరోజు ఘనంగా నిర్వహించాలని అనుకున్న తండ్రి మూడు రోజుల ముందుగా సింగపూర్ నుంచి స్వగ్రామానికి వచ్చాడు. వేడుకలకు బంధువులు, స్నేహితులు ఆహ్వానించి అన్నిఏర్పాట్లు చేసుకున్నాడు. ఆదివారం తన కొడుకు జన్మదిన వేడుకలను నిర్వహించి విందులో పాల్గొంటుండగా గుండెపోటుకు గురై మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి.. కరీంనగర్ జిల్లా కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లికి చెందిన దావు మధుకర్‌రెడ్డి(46) సింగపూర్‌లో పనిచేస్తూ జీవిస్తున్నాడు. ఆయన భార్య, కుమారుడు, కూతురు చామనపల్లిలో ఉంటున్నారు. మధుకర్‌రెడ్డి కుమారుడు సాత్విక్‌రెడ్డి 10వ జన్మదినం ఆదివారం ఉండగా, పుట్టినరోజు వేడుకలకు హాజరయ్యేందుకు మధుకర్‌రెడ్డి శనివారం(9వతేది) సింగపూర్ నుంచి చామనపల్లికి వచ్చాడు. అన్నిఏర్పాట్లు చేసుకుని బంధువులు, స్నేహితులను వేడుకలకు పిలుచుకుని ఇంటి వద్దనే ఆదివారం జన్మదిన వేడుకలను ఘనంగా జరపుకున్నారు. అనంతరం రాత్రి బంధువులతో విందులో పాల్గొన్న మధుకర్‌రెడ్డి హఠాత్తుగా గుండెపోటుకు గురై కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు, బంధువులు వెంటనే మధుకర్‌రెడ్డిని కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. ఈ హఠాత్ పరిణామంతో మధుకర్‌రెడ్డి భార్య, కూతురు, కొడుకు, బంధువులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. మధుకర్‌రెడ్డి ఈ నెల 9 నుంచి 10 రోజుల సెలవుపై స్వగ్రామానికి వచ్చాడు. శనివారం రాఖీపౌర్ణమి పండుగను జరుపుకోగా, ఈ నెల 17న సమీపబంధువు వివాహానికి హాజరై 19న తిరిగి సింగపూర్ వెళ్లాల్సి ఉంది.

గ్యాస్‌స్టౌవ్ రిపేర్ షాపుల్లో పోలీసుల తనిఖీలు

కోల్‌సిటీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పట్టణంలోని గ్యాస్ స్టౌవ్‌లు, సిలిండర్ రిపేర్ షాపుల్లో సోమవారం వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్నారనే సమాచారం మేరకు తనిఖీలు జరిపారు. కొందరు వ్యాపారులు గ్యాస్‌స్టౌవ్ రిపేర్ల పేర సిలిండర్ల నుంచి ఎలక్ట్రికల్ డీసీ మోటార్ల సహాయంతో కార్లలో గ్యాస్‌రీఫిల్లింగ్ చేస్తున్నారని, చిన్న సిలిండర్లలో గ్యాస్ నింపుతున్నారన్నారు. అలా గ్యాస్ నింపే క్రమంలో ఇటీవల మంటలు రావడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారని, కొందరు చొరవ తీసుకుని మంటలు ఆర్పకపోతే భారీ ప్రమాదం జరిగేదన్నారు. గ్యాస్ రీఫిల్లింగ్ చేయడం నేరమని, ఇలాంటి వారికి సిలిండర్ అమ్మినా, సహకరించినా నేరస్థులుగా పరిగణిస్తామన్నారు. గ్యాస్ స్టౌవ్ రిపేర్ చేసే యజమానులు, అందులో పని చేసే వారిని బైండోవర్ చేసినట్టు సీఐ తెలిపారు.



షాపులను తనిఖీ చేస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

గంజాయి విక్రయదారుల అరెస్ట్

● 50 గ్రాముల ఎండు గంజాయి, బైక్ స్వాధీనం

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట పోలీస్ సర్కిల్ పరిధిలోని వీర్నపల్లి మండలం రంగంపేట గ్రామశివారులో విక్రయించేందుకు వచ్చిన ముగ్గురు యువకులు స్థానిక పోలీసులకు చిక్కారు. వారివద్ద నుంచి 50గ్రాముల ఎండు గంజాయితోపాటు ద్విచక్రవాహనాన్ని స్వాధీనపర్చున్నారు. ఎల్లారెడ్డిపేట రూరల్ సీఐ శ్రీనివాస్ సోమవారం వివరాలను వెల్లడించారు. వీర్నపల్లి మండలం రంగంపేట గ్రామశివారులోని జంపన్న చెరువు ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారంతో ఎస్ఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలోని పోలీసులు అక్కడకు చేరుకున్నారు. నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం పందిమడుగు, వీర్నపల్లి మండలం సీతారాంనాయక్‌తండాలో నివాసం ఉంటున్న సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడువాసి బానోతు అజయ్‌కుమార్, సీతారాంనాయక్‌తండాలోని అజ్మీరా సాయివిశాల్‌లు తచ్చాడుతూ కనిపించారు. అదుపులోకి తీసుకుని తనిఖీ నిర్వహించడంతో వారివద్ద గంజాయి లభించింది. గంజాయికి అలవాటు పడిన నిందితులు నిజామాబాద్ పట్టణంలోని గుర్తు తెలియని వ్యక్తి వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి ఈ ప్రాంతంలోని యువకులకు అధిక ధరకు విక్రయిస్తున్నారని విచారణలో తేలింది. ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ శ్రీనివాస్ వివరించారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ లక్ష్మణ్, సిబ్బందిని సీఐ శ్రీనివాస్ అభినందించారు.

అదుపులోకి రాని మంటలు

● సివిల్ సప్లయిస్ గోదాంలో శ్రమిస్తున్న అగ్నిమాపక సిబ్బంది
● దగ్ధమైన 9.07 లక్షల గోనె సంచులు, రూ.70లక్షలు నష్టం
● మంటలు ఆర్పడానికి మిషన్ భగీరథ నీరు



మెట్‌పల్లి ఏఎంసీలోని గోదాంలో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలజిల్లా మెట్‌పల్లిపట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలోగల సివిల్‌సప్లయిస్ గోదాంలో చెలరేగిన మంటలను ఆర్పడానికి అగ్నిమాపక సిబ్బంది అవిశ్రాంతంగా శ్రమిస్తున్నారు. గోదాంలోని 9.07లక్షల గోనె సంచులు దగ్ధం కాగా రూ.70లక్షలు నష్టం వాటిల్లిందని సివిల్‌సప్లయిస్ డీఎం జితేందర్ ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఉదయం అకస్మాత్తుగా గోదాంలో నుంచి దట్టమైన పొగరావడాన్ని స్థానికులు గమనించి వెంటనే గోదాం ఇన్‌చార్జి బూరం సురేష్‌తో పాటు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక డీఎఫ్‌వో మధుకర్‌రెడ్డి నేతృత్వంలో మెట్‌పల్లి, జగిత్యాల, భీంగల్, ఖానాపూర్, ధర్మపురి అగ్నిమాపకకేంద్రాల నుంచి ఫైరింజన్లు తెచ్చి సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. సోమవారం మంటలు మరింతగా వ్యాపించడంతో అగ్నిమాపక వాహనాలకు నీరు సమయానికి అందకపోవడంతో పక్కన ఉన్న మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్‌లోని నీటిని వాడుతున్నారు. గోదాంలో నుంచి దట్టమైన పొగతో మంటలు ఎగిసిపడడంతో ఎక్స్‌కవేటర్లతో గోదాం గోడలను బద్దలు కొట్టి అందులోంచి కాలుతున్న గన్ని సంచులను బయటకు తీసుకొచ్చి ఆర్పివేసే ప్రయత్నం చేస్తున్నారు. కాగా మంటల వేడితో ఏ క్షణమైనా గోదాం కూలే ప్రమాదం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఎలాంటి ప్రమాదం జరగకుండా చుట్టపక్కల వారిని అధికారులు అప్రమత్తం చేశారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు స్పష్టంగా తెలియరాలేదు. గోదాం కిటికీలు తెరిచి ఉండడం, గోదాం చుట్టూ మద్యం సీసాలు ఉండడంతో మద్యం బాబుల పనా లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్

● మంటలు త్వరగా అదుపులోకి తీసుకురావాలి..

- కలెక్టర్ సత్యప్రసాద్

మంటలను త్వరగా అదుపులోకి తీసుకొచ్చి ఎలాంటి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. సోమవారం మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లోని గోదాం అగ్ని ప్రమాద స్థలాన్ని ఆయన సందర్శించారు. అగ్ని మాపక అగ్ని మాపక డీఎఫ్‌వో మధుకర్‌రెడ్డితో మాట్లాడి త్వరగా మంటలను ఆర్పివేయాలని ఆదేశించారు. మంటలు చల్లారేవరకు అధికారులు అందుబాటులోనే ఉండాలని సూచించారు. ఆయన వెంట ఆర్డీవో శ్రీనివాస్, సివిల్ సప్లయిస్ డీఎం జితేందర్‌ప్రసాద్, డీఎస్పీ రాములు, సీఐ అనిల్‌కుమార్, ఎస్సైలు కిరణ్‌కుమార్, చిరంజీవి, అనిల్, తహసీల్దార్ నీత, ఎంపీడీవో మహేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మోహన్ ఉన్నారు.

రూ.7600 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తిధర రూ.7600 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు ఇద్దరురైతులు పదిక్వింటాళ్ల విడిపత్తి విక్రయానికి తీసుకువచ్చా రు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వార గరిష్ఠ ధర రూ.7600 చెల్లించి ప్రైవేట్ ట్రేడర్స్ కొనుగోళ్ల చేపట్టారు.

108వాహనం తనిఖీ

శంకరపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడికరీంనగర్ జిల్లా 108 నూతన ప్రోగ్రాంమేనేజర్ జనార్దన్ శంకరపట్నం 108వాహనాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. వాహనంలో ఉన్న వైద్యపరికరాలను, వాటి పనితీరు, ఔషధాలను, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంకితభావంతో పనిచేసే ప్రతిఉద్యోగికి గుర్తింపు ఉంటుందన్నారు. ప్రమాదంలో గాయపడిన వ్యక్తులకు మెరుగైన వైద్య సేవలందిస్తూ సమీప ప్రభుత్వాస్పత్రిలో చేర్పించాలన్నారు. 108సిబ్బంది ఈఎంటీ గూడూరు సతీష్‌రెడ్డి, పైలెట్ ఖాజాఖలీల్ పనితీరుపై సంతృప్తి పొందారు.

ఇసుక తరలిస్తున్న వాహనం పట్టివేత

తిమ్మాపూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేణికుంట గ్రామంలోని మోయతుమ్మెదవాగు నుంచి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న వాహనాన్ని రేణికుంటలో ఎల్ఎండీ పోలీసులు పట్టుకున్నారు. వాహనయాజమాని, డ్రైవర్‌అయిన కోహెడమండలం వింజపల్లి గ్రామానికి చెందిన గీకురురమేష్‌పై కేసునమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

శంకరపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతులు లేకుండా వీణవంక మండలం కోర్కల్ గ్రామంనుంచి హుజూరాబాద్‌కు ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను ఆముదాలపల్లి శివారులో సోమవారం కేశవపట్నం పోలీసులు పట్టుకున్నారు. కోర్కల్ గ్రామానికిచెందిన ట్రాక్టర్ డ్రైవర్ ఎరవేణి శ్రీనివాస్‌పై కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐశేఖర్‌రెడ్డి తెలిపారు.

ఇద్దరిపై కేసు నమోదు

ఇల్లందకుంట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ అనిల్‌కుమార్, అటెండర్ రాకేష్ ఈనెల 5నవిధులు నిర్వహిస్తుండగా గట్టు సాయిరాం, పసునూటి శివ ఇవ్వాళ ఎందుకు డ్యూటికి వచ్చారని, ఆదివారం సెలవు రోజు ఎందుకు పని చేస్తున్నారని బెదిరించారు. తీవ్రపదజాలంతో దూషించారు. విధులకు ఆటంకం కలిగించినట్లు అనిల్‌కుమార్ సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు.


ఆలయ ఆవరణలో భక్తులు

హరహర మహాదేవ.. శంభో శంకరా..

● భక్తజన సంద్రంగా మారిన రాజన్న క్షేత్రం

● కోడెమొక్కులు, కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): హర హర మహాదేవ.. శంభో శంకరా.. అంటూ భక్తులు చేసిన నినాదాలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. శ్రావణ సోమవారం సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి 50 వేలకు పైగా భక్తులు ఆలయానికి తరలివచ్చారు. సోమవారం తెల్లవారుజామునే భక్తులు రాజన్న ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. భక్తులు శివసత్తుల పూనకాలతో ఊగిపోయారు. రాజన్నకు ఎంతో ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకునేందుకు క్యూలైన్‌లో నాలుగు గంటల పాటు నిరీక్షించినట్లు భక్తులు తెలిపారు. భక్తులు కుంకుమ పూజలో పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో రాధాబాయి ఆధ్వర్యంలో ఏఈవోలు బ్రహ్మన్న గారి శ్రీనివాస్, శ్రావణ్ కుమార్, అశోక్‌కుమార్ ఉద్యోగులు నరేందర్, శ్రీనివాస్ చారి, రాజేందర్‌లు ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ క్యూలైన్‌లు త్వరగా కదిలేలా చర్యలు తీసుకున్నారు.

భీమన్న ఆలయంలో మహాలింగార్చన



వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి అనుబంధ ఆలయమైన భీమన్న ఆలయంలో సోమవారం మహాలింగార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజన్న ఆలయ ఈవో రాధాబాయి హాజరై దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. కుమార్, సూపరింటెంట్ వెంకటప్రసాద్, రాజేశ్వర్‌రావు ఉన్నారు.

ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి ఉమ్మడి జిల్లాకు 6 వేల టన్నుల యూరియా

● పెద్దపల్లి జిల్లా కలెక్టర్ చొరవ

● ఐదు రోజుల్లో మూడు విడుతలుగా రవాణా...

● యూరియా కొరత వేళ యుద్ధ ప్రాతిపదికన సరఫరా

కోల్‌సిటీ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో యూరియా కొరత ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఆర్ఎఫ్‌సీఎల్ యుద్ధ ప్రాతిపదికన యూరియా సరఫరా చేస్తుంది. ప్రాథమిక సహకార సంఘాల వద్ద యూరియా కొరతతో రైతులు బారులు తీరుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు ఐదు రోజుల్లో 6వేల టన్నుల యూరియాను ఆర్ఎఫ్‌సీఎల్ సరఫరా చేసింది. కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రత్యేక చొరవ తీసుకుని యాజమాన్యాన్ని సమన్వయం చేస్తున్నారు.

పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలకు చెందిన ముగ్గురు వ్యవసాయశాఖ అధికారులు ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యంతో సమన్వయం చేస్తున్నారు. పెద్దపల్లి జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఆధ్వర్యంలో మంథని, మంచిర్యాల ఏడీఏ, రామగుండం వ్యవసాయశాఖ అధికారి రేక్‌ల ద్వారా యూరియా రవాణాను పర్యవేక్షిస్తున్నారు. ఒక రేక్ పూర్తిగా, రెండు రేక్‌లు సగం చొప్పున కరీంనగర్ రైల్వేయార్డ్‌కు పంపించారు. అక్కడి నుంచి కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్లా, పెద్దపల్లి జిల్లాలకు సరఫరా చేస్తున్నారు. అధికంగా పెద్దపల్లి జిల్లాకు సరఫరా చేశారు.


ఆగస్టులో 1.5లక్షల టన్నుల యూరియా రవాణాను కేంద్ర ప్రభుత్వం ఆర్ఎఫ్‌సీఎల్‌కు టార్గెట్‌గా నిర్ణయించింది. అందులో 65వేల టన్నులు తెలంగాణకే సరఫరా చేయాల్సి ఉంది. ఇప్పటివరకు కరీంనగర్, మంచిర్యాల, మిర్యాలగూడ, నిజామాబాద్‌లకు డిమాండ్‌ను బట్టి వెంట వెంటనే సరఫరా చేస్తున్నారు. ఒక్కో సమయంలో సగం రేక్ ఒక జిల్లా, మరో సగం రేక్ మరో జిల్లాకు పంపించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సోమవారం జడ్చర్లకు 3వేల టన్నుల రేక్‌ను పంపారు. ఎక్కడెక్కడ యూరియా కొరత తీవ్రత ఉందో అక్కడికి వెంట వెంటనే యూరియా రవాణా చేస్తున్నారు. ఎలాంటి సాంకేతిక అవరోధాలు ఏర్పడకపోతే ఆగస్టు మాసంలో 50వేల టన్నుల నుంచి 55వేల టన్నుల యూరియా తెలంగాణకు సరఫరా చేసే అవకాశం ఉంది.


యూరియా అన్‌లోడ్ చేస్తున్న కార్మికులు

ట్రాన్స్‌ఫార్మర్ చోరీల కేసులో నిందితుల అరెస్టు

భీమదేవరపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వరంగల్, కరీంనగర్ కమిషన రేట్ల పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ చేస్తున్న ఇద్దరు నిందితులను హన్మకొండ జిల్లా ముల్కనూర్ ఎస్ఐ సాయిబాబు పట్టుకున్నారు. ముల్కనూర్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం సాయంత్రం ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి సీఐ పులి రమేష్ విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండల కేంద్రానికి చెందిన బండి కుమార్, సతీష్ సోదరులు. వీరు ట్రాన్స్‌ఫార్మర్లు దొంగలిస్తూ అందులో ఉన్న కాపర్, అల్యూమినియం వైర్లను అమ్మివాటితో వచ్చిన సొమ్ముతో జల్సాలు చేస్తున్నారు. సోమవారం ఉదయం ముల్కనూర్ ఎస్ఐ సాయిబాబు వాహనంలో వెళ్తుండగా, ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వెళ్తూ అనుమానస్పదంగా కనిపించారు. వారిని తనిఖీ చేయగా వారి వద్ద టూల్స్ కనిపించాయి. విచారించగా ట్రాన్స్ ఫార్మర్లు చోరీ చేస్తున్న విషయాన్ని వెల్లడించారు. తాము చోరీ చేసిన కాపర్, అల్యూమినియం వైర్‌ను ముల్కనూర్‌కు చెందిన రుద్రాక్ష తిరుపతికి విక్రయిస్తున్నట్లు తెలిపారు. దీంతో పోలీసులు కుమార్, సతీష్, తిరుపతిని అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి రూ. 2.5 లక్షల విలువ చేసే 250 కిలోల కాపర్ వైరు, మూడు కరెంటు మోటార్లు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు.


మాట్లాడుతున్న ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి



విద్యుత్ ఉద్యోగులకు భరోసా

● అందుబాటులోకి బీమా పథకం

● విధి నిర్వహణలో మృతి చెందితే రూ. కోటి పరిహారం

● తీవ్రంగా గాయపడితే రూ.80లక్షలు

● సహజమరణం చెందితే రూ.10లక్షలు

గణేశ్‌నగర్,ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో ఉద్యోగమంటే ప్రాణంతో చెలగాటమే. ప్రమాదం ఎప్పుడు ఎక్కడి నుంచి ముంచుకు వస్తుందో తెలియదు. నిత్యం ప్రమాదం అంచున ఉద్యోగులు పని చేయాల్సి ఉంటుంది. అటువంటి వారికి సామాజిక, ఆర్థిక భద్రత కల్పించేందుకు బీమా అమలులోకి వచ్చింది. నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఎన్పీడీసీఎల్) సీఎండీ వరుణ్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని విద్యుత్ ఉద్యోగు లందరికీ బీమా సౌకర్యం కల్పించారు.

ఎలాంటి కంట్రిబ్యూషన్ లేకుండానే...

బీమా పొందాలంటే ప్రత్యేకంగా పాలసీ తీసుకోవాల్సిన అవసరం లేదు. ఉద్యోగి బ్యాంక్ ఖాతాలో ప్రతీ నెలా వేతనం జమ అయితే చాలు. విద్యుత్ సిబ్బందిలో నమ్మకం, ధైర్యాన్ని ఇవ్వడం కోసం ఎలాంటి కంట్రిబ్యూషన్ లేకుండా ఈ పథకాన్ని తీసుకొచ్చారు. ఉద్యోగి వేతనం నెలకు 25 వేలకు పైగా ఉడాలి. ఒప్పందం చేసుకున్న బ్యాంకుల్లో ప్రతీనెల జీతం జమ కావడమే ఈ బీమాకు అర్హత. ప్రారంభంలో మొదటి నెల 1న జీతం జమ చేస్తే మరుసటి నెల 1వ తేదీ నుంచి నుంచి బీమా వర్తిస్తుంది. మూడు నెలల్లో ఒక్క సారైన డబ్బులు డ్రా చేసుకోవాలి. ఎన్పీడీసీఎల్ పరిధిలో పని చేసే అటెండర్, వాచమన్ మొదలుకొని ఎస్ఈ వరకు ఈ బీమా వర్తిస్తుంది. ఈ బీమా పథకం ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 జిల్లాలకు గాను 13,287 మంది ఉద్యోగులకు వర్తించగా వీరిలో ఉద్యోగులు 9,821 కాగా ఆర్టిజన్ కార్మికులు 3,466 మంది ఉన్నారు. ఈ పథకం కింద జిల్లాలో సుమారు 1918 మందికి పైగా ఉద్యోగులు లబ్ధి పొందుతున్నారు.

భారీగా పరిహారం

గతంలో విద్యుత్ ఉద్యోగి విధి నిర్వహణలో మరణించినా, తీవ్రంగా గాయపడినా సంస్థ అందించే పరిహారం తక్కువగా ఉండేది. వారు వ్యక్తిగతంగా చేసుకున్న బీమా పాలసీల ద్వారా మాత్రమే పరిహారం అందేది. ప్రస్తుతం కల్పిస్తున్న బీమా సౌకర్యం వల్ల విధినిర్వహణలో విద్యుత్ ఉద్యోగి మరణిస్తే కోటి రూపాయల వరకు పరిహారం అందుతుంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కదలలేని స్థితిలో ఉన్న ఉద్యోగులకూ కోటి రూపాయల వరకు పరిహారం అందేలా ఏర్పాట్లుచేశారు. శాశ్వత అంగవైకల్యం (పీపీడీ) కలిగిన వారికి 80లక్షల పరిహారం వరకు అందుతుంది. ఉద్యోగి సహజమరణం చెందితే 10 లక్షల రూపాయల వరకు బీమా ఉంటుంది. ఉద్యోగితో పాటు నలుగురు కుటుంబ సభ్యులకు కలిపి 20 లక్షల వరకు బీమా సౌకర్యం ఉంటుంది. ఈ మేరకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), యూనియన్ బ్యాంక్(యూబీఐ)తో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఎస్‌బీఐలో ఖాతా తెరిచిన విద్యుత్ ఉద్యోగులకు కేవలం ప్రమాద బీమానే కాకుండా పెళ్లి, విద్య పరమైన సహాయంలోను రుణాలు బ్యాంకులు అందించనున్నారు.



మృతి చెందిన విద్యుత్ కార్మికుడి కుటుంబానికి కోటి రూపాయల ప్రమాద బీమా పరిహారం (ఫైల్)

బీమా పథకంతో ఉద్యోగులకు మేలు

మేక రమేష్‌బాబు, టీజీఎన్పీడీసీఎల్ ఎస్ఈ



గతంలో డిపార్మెంట్ పరంగా లేదా సొంతంగా చేసుకున్న బీమా పథకం ద్వారా మాత్రమే పరిహారం అందేది. ఇటీవల కరీంనగర్ సర్కిల్ పరిధిలోని చెంజర్ల సెక్షన్‌లో పని చేసే జోగు నరేశ్ ప్రమాదవశాత్తు మృతి చెందాడు. ఆయన కుటుంబానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకోటి రూపాయల ప్రమాద బీమా పరిహారం అందజేశారు. ఈ పథకం ద్వారా జిల్లాలో 1,918 మందికిపైగా ఉద్యోగులకు మేలు జరుగుతుంది.



ఆలయ వసతి గదుల్లో నాగుపాము

వేములవాడ కల్చరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయ పార్వతిపురం వసతి గదుల్లో నాగుపాము ప్రత్యక్ష మైంది. వసతి గదుల బ్లాక్‌లో మెట్ల కిందకు వెళ్లిపోయింది. దీంతో ఆలయ ఉద్యోగులు స్నేక్ క్యాచర్‌కు సమాచారం అందించడంతో పామును పట్టుకునేందుకు సదరు వ్యక్తి గంటపాటు శ్రమించినట్లు తెలిపారు. ఆలయ వసతి గదుల్లో నాగుపాము రావడంతో భక్తులు భయాందోళనకు గురయ్యారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

వరల్డ్ బ్యాంకు కన్సల్టెన్సీ టీం సభ్యుడు కిషన్

మానకొండూర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని వ్యాధులకు దూరంగా ఉండాలని వరల్డ్ బ్యాంకు కన్సల్టెన్సీ టీం సభ్యులు కిషన్, ఫిలిప్ సూచించారు. మండలంలోని అన్నారం సబ్‌సెంటర్‌ను సోమవారం వారు సందర్శించారు. గ్రామంలో శానిటేషన్, ప్రజల ఆరోగ్యం, పరసరాల పరిశుభ్రత, వైద్యసేవలపై గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల విద్య, వైద్యం, తదితర విషయాలను తెలుసుకున్నారు.

వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరి చేరవన్నారు. మురికి కాల్వలలో నీటి నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు సల్మాన్, రాజ్‌నాయక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు, పక్కన మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం

ఫోన్ ట్యాపింగ్ విచారణలో రాజకీయ జోక్యం ఉండదు

● పార్టీ మారిన ఎమ్మెల్యేలపై నిర్ణయం స్పీకర్‌దే ● రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ విచారణలో రాజకీయ జోక్యం ఉండదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. సోమవారం కరీంనగర్‌లో సుడా వాణిజ్య భవన సముదాయ నిర్మాణానికి, ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్ ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం కూడా విచారణ జరుపుతున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ విషయంలో పెద్ద తప్పు చేసిందని, విచారణలో అన్ని విషయాలూ వెల్లడవుతాయని అన్నారు.

మరోసారి ఇలాంటివి జరుగకుండా తప్పు చేసినవారికి శిక్ష పడేలా కార్యాచరణ ఉంటుందన్నారు. ఎవరిని విచారిం చాలన్న దానిపై సిట్ బృందం నిర్ణయం తీసుకుంటుందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ లోపాయికారి ఒప్పందంతో ముందుకుసాగుతున్నాయని విమర్శించారు. కాళేశ్వరం నిర్మాణం తరువాత ఐదేళ్ల బీజేపీ అధికారంలో ఉందని, దానిపై ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాట్లాడుతుంటే అడ్డుకోవడంతోపాటు బీఆర్ ఎస్‌కు షెల్టర్ ఇవ్వాలనే ఆలోచనతో ఉన్నట్లు బీజేపీ నాయకుల వైఖరి కనిపిస్తోందన్నారు.

కేంద్రం పరిధిలో బీసీ రిజర్వేషన్ల బిల్లు

బీసీల 42 శాతం రిజర్వేషన్ల బిల్లుకు అసెంబ్లీలో ఆమోదం తెలిపి గవర్నర్‌కు పంపించామని, గవర్నర్ రాష్ట్రపతికి పంపించారని మంత్రి తెలిపారు. ఇప్పుడు బిల్లు కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉందని, వారే వెల్లడిం చాలని అన్నారు. రిజర్వేషన్ల బిల్లుపై చిత్తశుద్ధి ఉం టే బీజేపీ ఎనిమిది మంది ఎంపీలు జంతర్‌మంతర్ ధర్నాలో ఎందుకు పాల్గొలేదని ప్రశ్నించారు. వివిధ పార్టీల ఎంపీలు ధర్నాకు సంఘీభావం తెలిపారన్నారు. పార్టీమారిన 10 మంది ఎమ్మెల్యే లపై స్పీకర్ నిర్ణయం తీసుకుంటారన్నారు.

కరీంనగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికపై అతి త్వరలో కార్యాచరణ ఉంటుందన్నారు. పారి శ్రామిక కారిడార్‌కు కేంద్రం ప్రభుత్వం కొన్ని నిర్ణయాలు ప్రకటించిందని, ప్రతిపాదనలు పంపిస్తున్నామని తెలిపారు. ఇందుకు కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి సహకారం కోరుతున్నామన్నారు. తెలంగాణలో పారిశ్రామికవాడలు, పెట్టుబడులు రావాలని, ఇక్కడ ఉన్న యువత కు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని బేషజాలు లేకుండా కేంద్రమంత్రులను కలుస్తున్నామని తెలిపారు.

డ్యాం సేఫ్టీ అథారిటీ నివేదిక ప్రకారమే ముందుకు

కాళేశ్వరం ప్రాజెక్టుపై డ్యాం సేఫ్టీ అథారిటీ నివేదిక ప్రకారమే రాష్ట్ర ప్రభుత్వం ముందుకుసాగుతుందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ప్లానింగ్ ఎగ్జిక్యూషన్‌లో నిర్మాణంలో లోపాలున్నాయని, నీటిని నిలువ చేస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉందని డ్యాంసేఫ్టీ అధికారులు నివేదికలో చెప్పడంతో నీటిని నిలువ చేయలేదన్నారు. నీటిని నిలువతో మేడిగడ్డ సమస్య ఎదురైతే ఆ పరిసరాలు ముంపునకు గురయ్యే అవకాశముందన్నారు. అందుకే అథారిటీ ఇచ్చే నివేదిక ద్వారా ప్రతీ కార్యక్రమం చేపట్టాలని ఆలోచన చేస్తున్నామన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టుపై కొంత మంది డ్రామాలాడు తున్నారని, నాణ్యతతో పనులు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. మేడిగడ్డ ప్రాజెక్టు కూలిపోతే ఆ రోజు ఏమీ మాట్లాడని వారు ఈ రోజు నీరు కావాలంటున్నారని, అథారిటీ నివేదిక నిర్ధారణ సర్టిఫికెట్‌ను ఉపయోగించి చర్యలు తీసుకుంటామని అన్నారు. రైతులకు న్యాయం చేసేందుకు తాము వెనుకడుగువేయబోమన్నారు. సమావేశంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కటుకం మృత్యుంజయం, ఆరెపల్లి మోహన్, నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి హెల్త్ స్కీం అవసరం

సుభాష్‌నగర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి హెల్త్ స్కీం అవసరమని టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం నగరంలోని సుడా కార్యాలయంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా బెనిఫిట్స్ చెల్లింపుల్లో ఆలస్యం, హెల్త్‌స్కీం అమలు అవసరాలను వివరించారు. హౌస్ బిల్డింగ్ రుణాలు, జీపీఎఫ్ రుణాలు, టీఏ బిల్లులు, జీఎల్ఐ బిల్లులు, వైద్య ఖర్చులకు సంబంధించిన బిల్లులు సకాలంలో చెల్లించడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, వారి కుటుంబాలకు నగదు రహిత వైద్యం అందించడంలో ఎంప్లాయీస్ హెల్త్‌స్కీం కీలకపాత్ర పోషి స్తుందన్నారు వైద్య ఖర్చుల భారం గణనీయంగా తగ్గుతుందన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు స్పందించి ఎంప్లాయీస్ హెల్త్ స్కీంకు సంబంధించి త్వరలోనే తీపి కబురు వింటారని ఉద్యోగులకు భరోసా కల్పించారు. సంఘం అసోసియేట్ అధ్యక్షుడు ఒంటెల రవీందర్‌రెడ్డి, కేంద్ర సంఘం నాయకులు నాగుల నర్సింహస్వామి, గూడ ప్రభాకర్‌రెడ్డి, సర్దార్ హర్మిందర్‌సింగ్, జిల్లా కోశాధికారి ముప్పిడి కిరణ్ కు మార్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మారుపాక రాజేశ్ భరద్వాజ్, కార్యదర్శి వెలి చాల సుమంత్‌రావు, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి శంకర్, ఎడ్ల మహేశ్, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.


మంత్రులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉద్యోగులు


శ్రీరాంసాగర్‌కు తగ్గిన ఇన్‌ఫ్లో

ప్రాజెక్టులోకి 11,483 క్యూసెక్కుల నీరు రాక

జగిత్యాల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి సోమవారం ఇన్‌ఫ్లో తగ్గింది. ఎస్సారెస్పీలోకి 11,483 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి గాను ప్రస్తుతం 44.71 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, కలిపి ప్రాజెక్టు నుంచి 5,658 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో కాకతీయ కాలువకు 3,500 క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 800 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 150 క్యూసెక్కులు, వరద కాలువకు 3 వేల క్యూసెక్కులు, అలీ సాగర్ ఎత్తిపోతల పథకానికి 360 క్యూసెక్కుఉల, గుత్పా ఎత్తిపోతల పథకానికి 135 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 462 క్యూసెక్కుల నీరు ఆవిరి అవు తోంది. ఇదిలా ఉండగా జూన్ 1వ తేది నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 37.659 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 6.479 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

వరద కాలువకు నీరు నిలిపివేత...

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి వరద కాలువకు నీటి విడుదలను సోమవారం అధికారులు నిలిపివేశారు. మధ్యాహ్నం 1.15 గంటల నుంచి ఇందిరమ్మ వరద కాలువ హెడ్ రెగ్యులటరీ గేట్లు మూసి వేసి నీటి విడుదల నిలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వరద కాలువకు నీటి విడుదల నిలిపి వేసినట్లు ఎస్సారెస్పీ ప్రాజెక్టు అధికారులు ప్రకటించారు.




నేడు అంతర్జాతీయ యువజన దినోత్సవం

యువతా మేలుకో..

గణేశ్‌నగర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): యువత అంటే వ్యక్తుల సమూహం కాదు... వనరులను సద్వినియోగం చేసుకుంటూ ప్రపంచాన్ని ముందుకు తీసుకెళ్లాలని చూసే మహత్తరమైన శక్తి. అలాంటి శక్తి, యుక్తుల సమాహారంగా జరుపుకునేదే అంతర్జాతీయ యువజన దినోత్సవం. అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఆగస్టు 12న ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారు. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువజన వేడుకలను ప్రతి సంవత్సరం ఒక్కో దేశంలో నిర్వహిస్తుంటారు. సమాజానికి పౌరులకు సంబంధించిన ఒక (థీమ్) అంశంతో ఈ వేడుక నిర్వహిస్తారు.

● **నేపథ్యం**

1999వ సంవత్సరంలో ఐక్యరాజ్యసమితి చేసిన తీర్మానం ద్వారా మొదటి అంతర్జాతీయ యువజన దినోత్సవం ఆగస్టు 12, 2000న నిర్వ హించారు. అప్పటి నుంచి ఆగస్టు 12ను అంతర్జాతీయ యువజన దినోత్సవంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. ప్రతి సంవత్సరం ఆనవాయితీగా వస్తున్న ఈ వేడుక రజతోత్సవాన్ని ఈ యేడు కెన్యా దేశంలో నిర్వహిస్తున్నారు. ఈ వేడుకలో వివిధ దేశాలకు చెందిన లక్షలాదిమంది యువత పాలుపంచుకుంటుంది. అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని ఈసారి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు- స్థానిక యువత చర్యలు థీమ్‌తో నిర్వహిస్తున్నారు.

● **అంతర్జాతీయ వేదికలపై జిల్లా వాసులు**

కరీంనగర్ జిల్లాలోని పలువురు యువజన సంఘాల ప్రతినిధులు జాతీయ స్థాయిలో ఉత్తమ యువజన వార్డులు అందుకోవడంతోపాటు అంతర్జాతీయ యువజన వేడుకల్లో పాల్గొన్నారు. గంగాధర మండలం కొండన్నపల్లి గ్రామానికి చెందిన నెహ్రూ యూత్ క్లబ్ అధ్యక్షుడు రేండ్ల కళింగ శేఖర్,షిప్ ఫర్ వరల్డ్ యూత్ సమ్మిట్‌లో పాల్గొన్నారు. కరీంనగర్‌కు చెందిన వివే కానంద యూత్ క్లబ్ అధ్యక్షుడు ఎ కిరణ్‌కుమార్ ఇండో- చైనా యూత్ ఎక్ఛేంజ్ ప్రోగాంతో పాటు మలేషియా, సింగపూర్‌లో నిర్వహించిన అంతర్జాతీయ యువజన- సాంస్కృతిక వేడుకల్లో పాల్గొన్నారు. రామడుగు మండలం గోపాలరావుపేటకు చెందిన సబర్మతి యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అలువాల విష్ణు ఇండో- చైనా యూత్ ఎక్ఛేంజ్ వేదికలో భారతదేశ ప్రతినిధిగా పాల్గొన్నారు.

● **జిల్లాలో వేడుకల నిర్వహణ**

జిల్లాలోని యువత ప్రతి సంవత్సరం అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా వేడుకలను నిర్వహిస్తుంది. అందుకు అనుగుణంగా అంతర్జాతీయ యువజన వేడుకల అంశాల వారీగా అవగాహన సదస్సులను, ఫొటో ప్రదర్శనల వంటి కార్యక్రమాలను నిర్వహిస్తారు.



జంక్ ఫుడ్ నుంచి యువత రక్షించుకోవాలి..

డాక్టర్ ఒల్లాల శ్రావణ్‌కుమార్, జనరల్ ఫిజీషియన్



యువత ఆరోగ్యంగా ఉంటేనే ఆ దేశ భవిష్యత్తు బాగుంటుంది. అంతర్జాతీయ యువజన దినోత్సవం జరుపుకుంటున్న ఈ తరుణంలో, భారతదేశంలోని యువత ఎదుర్కొంటున్న ఆరోగ్య సవాళ్లను పరిష్కరించడం చాలా ముఖ్యమైనది. నేటి యువతలో 56.4 శాతం వ్యాధులకు అనారోగ్యకరమైన జంక్ ఫుడ్ ప్రధాన కారణం. యువత ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి. జంక్ ఫుడ్‌ను తీసుకోవద్దు.

యువతకు ఆరోగ్య యోగా అవసరం..

ముత్యాల రమేష్, యోగా మాస్టర్

వేగంగా మారుతున్న నేటి యుగంలో యువత ఎంతో ఒత్తిడికి, ఆందోళన గురవుతున్నారు. యువత జీవన విధానంలో ఏర్పడే భావోద్వేగాలను సరి చేసుకోవడానికి ఆరోగ్య యోగ కచ్చితంగా అవసరం. ఈ తరం యూత్ ప్రతిరోజు కనీసం 30 నిమిషాలపాటు యోగాకు కేటాయిస్తే మంచి ఆరోగ్య ఫలితాలు అందుతాయి. యోగా ద్వారా యువతకు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక స్థయిర్యాన్ని ఇస్తుంది.



ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ
- ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ..



ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్



కలెక్టరేట్‌కు తరలివచ్చిన కోనరావుపేట మండల రైతులు

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించాలని కలెకర్ సందీప్‌కుమార్ ఝూ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌కు సోమవారం ప్రజలు తమ సమస్యలను ప్రజావాణిలో చెప్పుకునేందుకు జిల్లా నలుమూల నుంచి కలెక్టరేట్‌కు తరలివచ్చారు. కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి పోలీసుల బందోబస్తుల మధ్య నిర్వహించారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ, ఆర్డీవో వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈవో వినోద్‌కుమార్, డీఆర్‌డీవో శేషాద్రిలు పాల్గొని సమస్యలను విన్నవించేందుకు వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ ప్రజావాణిలో 114 దరఖాస్తులు రాగా ఇందులో రెవెన్యూ శాఖకు 36, గృహనిర్మాణ శాఖకు 26, డీఆర్‌డీవోకు 20, ఉపాధి కల్పన శాఖకు 7, జిల్లా పంచాయతీరాజ్ శాఖకు 5, జిల్లా సంక్షేమ శాఖకు 5, పౌర సరఫరాల శాఖకు 4, సెస్‌కు 3, ఎస్‌డీసీకి 2, సిరిసిల్ల మున్సిపాల్టీకి 2, వ్యవసాయ శాఖకు 1, వైద్య ఆరోగ్య శాఖకు 1, ఎస్పీ కార్యాలయానికి 1, విద్యా శాఖకు 1 చొప్పున దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన అర్జీలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి త్వరగా పరిష్కారం చూపాపడంతోపాటు అర్జీదారులకు లిఖిత పూర్వకంగా సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌజింగ్ ఈఈ శంకర్, జిల్లా పంచాయతీ అధికారి షర్ఫుద్దీన్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సన్న రకం ధాన్యానికి బోనస్‌ను చెల్లించండి

- కలెక్టరేట్‌కు తరలివచ్చిన కోనరావుపేట రైతులు

మూడు నెలల క్రితం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన సన్నరకం ధాన్యంకు రాష్ట్ర ప్రభుత్వం అందించే రూ 5వందల బోనస్ డబ్బులను అందించాలంటూ కోనరావుపేట మండలానికి చెందిన రైతులు సోమవారం కలెక్టరేట్‌కు తరలివచ్చి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూను కలిసి సమస్యలను విన్నవించి వినతిపత్రాన్ని అందించారు. కోనరావుపేట మండలంలో మూడు నెలల క్రితం తాము పండించిన సన్నరకం ధాన్యంను విక్రయించడం జరిగిందని దానికి రావాల్సిన బోనస్‌లను ఇప్పటి వరకు చెల్లించలేదని ప్రస్తుతం వ్యవసాయ పనులు కొనసాగుతుండడంతో తమ పంటల సాగుకు పెట్టుబడులకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని కలెక్టర్ స్పందించి తమకు రావాల్సిన బోనస్ డబ్బులను చెల్లించి తమను అందుకోవాలని రైతులు తోల మల్లేశం, మాలోతు శంకర్‌నాయక్, శ్రీనివాస్, రత్నాకర్ మాధవరెడ్డిలు కోరారు.

వెన్నుపూస ఆపరేషన్‌కు సహకరించండి..

- మిడిదొడ్డి స్వాతిక, రాచర్లబొప్పాపూర్, ఎల్లారెడ్డిపేట



ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామానికి చెందిన మిడిదొడ్డి మల్లేశం, భాగ్య దంపతులకు పెద్ద కూతురిని. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి చుదు వుతున్నాను. ఏప్రిల్‌లో అడు కుంటూ పడిపోవడంతో నిల బడేందుకు సైతం ఇబ్బందులు పడుతున్నాను. నిరుపేదలైన నా తల్లిదండ్రులు వైద్య పరీక్షలు చేయించగా వెన్నుపూసలో ప్రాబ్లమ్ ఉందని, ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారు. ఇప్పటివరకు రూ.2లక్షల వరకు అప్పులు చేసి వైద్య పరీక్షలు చేయించారు. నిమ్స్‌లో నాకు ఆపరేషన్‌కు రూ.3లక్షలు అవుతాయని డాక్టర్ చెప్పారు. కలెక్టర్ స్పందించి నాకు ఆపరేషన్ చేయించి నన్ను ఆదుకోవాలని కోరుతున్నాను.

అక్రమ భవనాలపై చర్యలు తీసుకోవాలి

- లింగంపల్లి తిరుపతి, చింతల్‌ఠాణా ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, వేములవాడ అర్బన్



వేములవాడ అర్బన్ మండలంలోని చింతల్‌ఠాణా ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో అక్రమంగా నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవనాలపై చర్యలు తీసుకోవాలి. ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో గుర్రం బాలకిషన్ అనే వ్యక్తి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ కాలనీలోని సర్వేనంబర్ 487లో గత 2 సంవత్సరాలను ఎలాంటి అనుమతులు తీసుకోకుండా నిర్మాణాలు చేపట్టాడు. దీనిపై అధికారులకు ఫిర్యాదులు చేసిన ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. నిర్మాణాల కోసం తీసిన గుంతలో గత నెల 5వ తేదీన కాలనీకి చెందిన నలుగురు పిల్లలు అడు కుంటుండగా రిష అనే ఆరు సంవత్సరాల బాలుడు ఆ నీటి గుంతలో పడి చనిపోయాడు. దీనిపై వెంటనే కలెక్టర్ విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలి.

భూమిని అమ్ముకోకుండా అడ్డుకుంటున్నారు..

- కొండూరి రాజమౌళి, వేములవాడ



వేములవాడలో నివాసం ఉంటున్న నాకు ఐదుగురు ఆడపిల్లలు, ఒక్క కుమారుడు ఉన్నారు. అందరికి పెళ్లి చేశాను. నా కుమారుడు కొండూరి శ్రీనివాస్‌కు వేములవాడలో ఉన్న ఆస్తితో పాటు బ్యాంక్‌లో ఉన్న డబ్బులు సైతం ఇవ్వడం జరిగింది. గత 20 సంవత్సరాల నుంచి మా భార్యభర్తలను పట్టించుకోవడం లేదు. నాకు కొడిమ్యాల మండలం తిప్పాయిపల్లె గ్రామంలో సర్వే నంబర్ 11 ఇలో ఉన్న 10 గుంట భూమి, 12ఇలో ఉన్న 12గుంటలు, 14 గుంటలు, 13లో 2గుంటలు నాపేరున ఉన్నాయి. మా భార్యభర్తలం అనారోగ్యంతో ఉన్నాం. మాకు ఖర్చుల కోసం ఆ భూములను అమ్ముకుందామంటే నా కుమారుడు శ్రీనివాస్ అడ్డుకుని ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. కలెక్టర్ స్పందించి మాకు న్యాయం చేయాలి.

ఇంటి నంబర్ ఇప్పించండి..

- కంచర్ల పోషయ్య, పోత్గల్, ముస్తాబాద్



ముస్తాబాద్ మండలం పోత్గల్ గ్రామంలో 16 సంవత్సరాల క్రితం గ్రామ పంచాయతీ అనుమతులతో ఇంటిని నిర్మించుకున్నాను. ఇంటికి నంబర్‌ను ఇవ్వాలంటూ గ్రామపంచాయతీ అధికారుల చుట్టూ గత 16 సంవత్సరాలుగా తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. కలెక్టర్ స్పందించి నా ఇంటికి నంబర్‌ను ఇప్పించి ఆదుకోవాలి.

మిగిలింది మూడు రోజులే..

(5వ పేజీ తరువాయి)

బిల్లు-2024 ద్వారా సాదా బైనామాలతో క్రమబద్ధీకరణ చేయాలని నిర్ణయించడంతో రైతులు ఆశాభావంతో ఉన్నారు. గత ప్రభుత్వం 2020 సంవత్సరం నవంబరు వరకు సాదాబైనామాల దరఖాస్తులను స్వీకరించింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 15వేలమంది దరఖాస్తులు చేసుకున్నారు. వీటిని క్రమ బద్ధీకరించే చర్యలు మాత్రం జరగలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించగా మళ్లీ దరఖాస్తులు చేసుకున్నారు. సాదా బైనామాల సమస్యలపైనా 1675 దరఖాస్తులు వచ్చాయి. బోయి న్‌పల్లి మండలంలో 167, చందుర్తిలో 287, ఇల్లంతకుంటలో 200, గంభీరావుపేటలో 192, కోనరావుపేటలో 136, ముస్తాబాద్‌లో 306, సిరి సిల్లలో 13, తంగళ్ళపల్లిలో 75, వేములవాడలో 92, వేములవాడ రూర ల్‌లో 82, వీర్నపల్లిలో 49, ఎల్లారెడ్డిపేటలో 76 దరఖాస్తులు వచ్చాయి. ఆగస్టు 15 సందర్భంగా సాదాబైనామాలకు రిజిస్ట్రేషన్లకు ప్రభుత్వం అనుమతి ఇస్తుందనే ఆశాభావం దరఖాస్తుదారుల్లో నెలకొంది.

రైతుల్లో ఆశలు..

గత ప్రభుత్వం తెచ్చిన ధరణి పోర్టల్‌లో అనేక తప్పిదాలు బయట పడడంతో రైతులు కార్యాలయం చుట్టూ తిరిగి వేసారిపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా ఆర్‌వోఆర్ 2020-25 భూభారతి చట్టాన్ని తీసుకువచ్చింది. భూభారతిపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు సదస్సులు నిర్వహించి దరఖాస్తులను స్వీకరించారు. భూభారతిలో సాదా బైనామాలు సమస్యలు పరిష్కారం అవుతాయని దరఖాస్తుదారులు ఆశలు ఏర్పడ్డాయి. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో అమలు జరుగుతున్న భూ రికార్డుల నిర్వహణ పద్ధతులను పరిశీలించిన అనంతరం వ్యవసాయ, వ్యవసాయేతర భూములకు సంబంధించి వేర్వేరు రికార్డులు చేయడానికి ప్రభుత్వం నిర్ణయానికి వచ్చింది. భూ రికార్డులు మెరుగ్గా ఉండే విధంగా రైతు సంఘాలు మేధావులు, విద్యావేత్తలు, న్యాయవాదులు ప్రజాప్రతినిధులు, విశ్రాంత రెవెన్యూ ఉద్యోగుల సలహాలు, సూచనలు పరిగణనలోకి తీసుకొని భూభారతి కొత్త చట్టాని తీసుకవచ్చారు. పకడ్బందీగా భూభారతిలో డేటాను అప్‌లోడ్ చేశారు. 33 నుంచి 6 మాడ్యూల్‌లకు పరిమితం చేశారు. భూమిత్రలో సందేహాలను నివృత్తి చేసే విధంగా చాట్ బోర్డులు ఏర్పాటు చేశారు. దీనిద్వారా ఏ సందేహం అయినా తీర్చుకునే వీలు కల్పించారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సహకారంతో ఈ చాట్ బోర్డు పనిచేసేలా డిజైన్ చేశారు. ధరణి పోర్టల్‌లో వివరాల నమోదు, ఓటీపీ నమోదు వరకు 30 సెకండ్లు అవుతుండగా దీనినే నాలుగు సెకండ్లలోనే వివరాలు అందించేలా స్పీడ్ పెంచారు. 33 మాడ్యూల్‌లో కొన్నింటిని అనుసంధానం చేయగా 5,6 మాడ్యూల్‌లను పూర్తిగా తొలగించారు. 18, 19 మాడ్యూల్లను కలిపి ఆరుగా మార్చారు. రైట్ టు ప్రైవసీ చెక్‌ను తొలగించారు. గతంలో ధరణి పోర్టల్‌లో కొందరు తమ భూముల వివరాలను గోప్యంగా ఉంచుకునేందుకు వెసులుబాటు కల్పించిన ప్రైవసీ చెక్‌ను పూర్తిగా ఎత్తివేశారు. ప్రతి ఎకరం భూమి వివరాలు ఉండే విధంగా ఏర్పాటు చేశారు. సరళమైన భాషలో జనానికి అర్థమయ్యే విధంగా అంశాలను పొందుపర్చారు. భూభారతితో సమస్యల పరిష్కారంపై రైతుల్లో ఆశలు ఏర్పడ్డాయి.

నులి పురుగుల మాత్రలు తప్పనిసరిగా ఇవ్వాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ



విద్యార్థులకు మాత్రలు ఇస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ

తంగళ్లపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు నులి పురుగుల నివారణ మాత్రలు తప్పనిసరిగా ఇవ్వాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ ఆదేశించారు. సోమవారం జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకుని తంగళ్లపల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ నులి పురుగుల మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లడుతూ సంవత్సరం నుంచి 19 సంవత్సరాల వయసు గల పిల్లలందరికి అల్బెండజోల్ మాత్రను ఇవ్వాలని ఆదేశించారు. మాత్రను అందించి నమిలి మింగేలా చూడాలన్నారు. జిల్లాలోని పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలందరికి నులి పురుగుల మాత్రలు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 18 వ తేదిన మ్యాప్ డే రోజు మిగిలిపోయిన పిల్లలందరికి అందించాలని ఉపాధ్యాయులకు, వైద్య సిబ్బందికి సూచించారు. మాత్రల ఆవశ్యకత తదితర అంశాలపై వివరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి రజిత, తంగళ్లపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి దీప్తి, పాఠశాల హెచ్‌ఎం శంకర్ నారాయణ, ఏఎన్‌ఎంలు ప్రమీల, జ్యోతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జాతీయ భావాన్ని పెంపొందించాలి

- బీజేపీ కోనరావుపేట మండల అధ్యక్షుడు మిర్యాల్‌కర్ బాలాజీ



ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు

కోనరావుపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరిలో జాతీయ భావాన్ని పెంపొందించాలని కోనరావుపేట బీజేపీ మండల అధ్యక్షుడు మిర్యాల్‌కర్ బాలాజీ కోరారు. కోనరావుపేట మండల కేంద్రంలో హర్ ఘర్ తిరంగా యాత్ర రాష్ట్ర జిల్లా పార్టీ ఆదేశాలనుసారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కోనరావుపేటలో గాంధీ విగ్రహం వద్ద నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. యువకులలో దేశభక్తిని కలిగి ఉండేలా, ప్రజల్లో చైతన్య భావం పెంపొందించడం కోసం ప్రధాని నరేంద్ర మోదీ తీరంగా యాత్ర చేపట్టారని అన్నారు. స్వాతంత్ర్యం కోసం మహనీయులు చేసిన పోరాటాలని స్మరించుకుంటూ ప్రతి ఒక్కరిలో దేశం పట్ల, జాతీయ జెండా పట్ల పౌరులలో జాతీయ భావం పెంపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ మార్త సత్తయ్య, జిల్లా కౌన్సిల్ మెంబర్ గొట్టే రామచంద్రం, హర్ ఘర్ తిరంగ ప్రోగ్రాం కన్వీనర్ పురుషోత్తంరావు, మాజీ జడ్పీటీసీ పల్లం అన్నపూర్ణ, బైరగోని సురేష్‌గౌడ్, చింతల పరుశురాం, ఎడ్ల సుధాకర్, చీకటి మధు, పాలకుర్తి శ్రీనివాస్, వేల్పుల తిరుపతి, ఎక్కలదేవి జలంధర్, తీగల జయశ్రీ, బోయిని నర్సయ్య, శంకర్, జింక వెంకటి, జవ్వాజి తిరుపతి గౌడ్, బొల్లారం తిరుపతి, మోతుకు మోహన్, దుర్గం తిరుపతి, ముష్కం శ్రీనివాస్, తీగల రవీందర్, జిన్నా అనిల్, వికాస్, శ్రీకాంత్, లంబ వేణు, అక్షయ్, పొన్నం మహేష్, సురభి సురేష్‌రావు, పాక మహేష్, నేరెళ్ల లింబయ్యగౌడ్, అవురం తిరుపతి, గుమ్మడి శివ, మనోహర్, ఆకుల నాగరాజు, ఎక్కలదేవి హరీష్, పిల్లి వెంకటేష్, శ్రీనివాస్, వినోద్, దేవేందర్ పాల్గొన్నారు.

ఫోన్ ట్యాపింగ్ చేయాల్సిన అవసరం కేటీఆర్‌కు లేదు..

- బీఆర్‌ఎస్ యూత్ పట్టణ అధ్యక్షుడు మనోజ్‌కుమార్

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర రాజకీయాలనే మార్చే శక్తి ఉన్న ప్రజా నాయకుడు కేటీఆర్‌కు ఫోన్ ట్యాంపింగ్ చేయాల్సిన కర్మ పట్టలేదని బీఆర్‌ఎస్ యూత్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు సుంకపాక మనోజ్ కుమార్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల నియోజకవర్గం ఎమ్మెల్యే కేటీఆర్‌పై బీజేపీ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు కుమ్మక్కై రాజకీయాలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చలేక పోతుంటే నిలదీయడం మానేసి ప్రతిపక్షంలో ఉన్న కేటీఆర్‌ను విమర్శించడం సరికాదన్నారు. కరీంనగర్ జిల్లాకేంద్రంలో కేంద్ర ప్రభుత్వ పరిధిలో నిర్మిస్తున్న ఫ్లైఓవర్ నిర్మాణం ప్రారంభించి ఎనిమిదేళ్లు అవుతుతోందని, త్వరగా పూర్తిచేయాలన్నారు. కేటీఆర్‌పై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోమన్నారు. సమావేశంలో మెట్టు రాజు, కత్తెర వరుణ్‌కుమార్, షేక్ సికిందర్, వడ్లూరి సాయిసూర్య, జోయేల్, వడ్లూరి వేణు, ఆరుట్ల శరన్ పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ



ఎల్లారెడ్డిపేటలో మాత్రలను వేస్తున్న వైద్య సిబ్బంది

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు రాచర్లబొప్పాపూర్, రాచర్లగొల్లపల్లి, నారాయణపూర్, బండలింగంపల్లి, పదిర, హరిదాస్‌నగర్, వెంకటాపూర్, గుండారం, తిమ్మాపూర్, కోరుట్లపేట, అక్కపల్లి, దుమాల, తదితర గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులు, చిన్నారులకు వైద్య అధికారులు సోమవారం మాత్రలను పంపిణీ చేశారు. ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో మొత్తం 14030 మంది పిల్లలను గుర్తించి 11897 మందికి మాత్రలను పంపిణీ చేశామని, మిగిలిన పిల్లలకు ఈనెల 18న అందిస్తామని, ఎల్లారెడ్డిపేట,వీర్నపల్లి పీహెచ్‌సీ వైద్యా ధికారులు సారియా అంజుమ్, స్నేహ పేర్కొన్నారు.

ఫోటో ఫైల్‌నెంబర్: 323ఎస్‌ఆర్‌ఎస్ 11

రైటప్: మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

● ఇల్లంతకుంట : నులిపురుగుల నివారణ మాత్రలు తప్పనిసరిగా ప్రతి విద్యార్థి తీసుకోవాలని మండల వైద్యాధికారి జీవనజ్యోతి పేర్కొన్నారు. మండలంలోని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో సోమవారం నులిపురుగుల నివారణ మాత్రలు వేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిణి ప్రేమలత, పీహెచ్‌ఎన్ తారాబాయి, సూపర్‌వైజర్ జవహార్, స్వప్న, ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

● కోనరావుపేట : కోనరావుపేట మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశామని వైద్యాధికారి వేణుమాధవ్ తెలిపారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● చందుర్తి : మండలంలోని సనుగుల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం నులి పురుగుల నివారణ మాత్రలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ముఖేష్ డాక్టర్ నవీన్, ఆశా వర్కర్ రాజవ్వ తదితరులు పాల్గొన్నారు.

● రుద్రంగి : మండల కేంద్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు నులిపురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలు ప్రభుత్వ వైద్య సిబ్బంది పంపీణీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి ప్రభాకర్, ఎమ్‌ఎల్‌హెచ్‌పీ లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం ఆందోళన వద్దు

చందుర్తి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : యూరియా కోసం రైతులు ఆందోళన చెందవద్దని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని అఫ్జల్ బేగం అన్నారు. చందుర్తిలో సోమవారం ఆమె మాట్లాడుతూ రైతులు పంటలకు అధిక మోతాదులో యూరియాను వినియోగిస్తున్నారని, వీటితో రైతులే నష్టపోతారన్నారు. యూరియాకు బదులు నానో యూరియా వినియోగంపై దృష్టి సారించాలని కోరారు. రైతులకు సరిపడా యూరియా సరఫరా చేస్తామన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

చందుర్తి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండల కేంద్రంలో దీకొండ రాజు, మూడపల్లి గ్రామంలో కట్కూరి దేవయ్యలు ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాలను బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి సోమవారం పరామర్శించారు. మాజీ ఎంపీపీ చిలుక పెంటయ్య, మాజీ సర్పంచులు చిలుక అంజిబాబు, నాయకులు సంటి బాబురావు, బొడిగె అనిల్, సిరికొండ మల్లయ్య, రవి, తదితరులు ఉన్నారు.

ఇసుక అక్రమ రవాణాను నివారించండి

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామ శివారులోని మనేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణాను నివారించాలంటూ ముస్తాబాద్ మండలం రామలక్ష్మణ్‌పల్లి గ్రామస్థులు సోమవారం కలెక్టరేట్‌కు తరలివచ్చి కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా, అదనపు ఎస్పీ చంద్రయ్యలను కలిసి వినతిపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవీందర్‌రెడివ్వ, శ్రీనివాస్, రాజు, బాలయ్య, రాజశేఖర్, ఎల్లయ్య, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం మున్సిపల్ పరిధిలోని 25వ వార్డు పద్మనగర్‌లో సోమవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు వార్డు మాజీ కౌన్సిలర్ కుడికాల రవికుమార్ పంపిణీ చేశారు. కాముని దత్తు, రూ.60వేలు, రాపెల్లి అర్చన రూ. 29వేలు, గాజుల ఓంకార్ రూ. 10500లు, పొన్న రమ్య, రూ. 21500లు, లింగంపెల్లి మమత, రూ. 14వేలు, గాజుల వరలక్ష్మి రూ. 5వేలు, దూస కమల రూ. 25వేలు చెక్కులను అందించారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిరల్ రవికుమార్ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి చొరవతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి చెక్కులు వచ్చాయన్నారు. సహకరించిన కేకే మహేందర్ రెడ్డికి రవికుమార్, లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎక్కలదేవి సంతోష్, పిస్క కమలాకర్ పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పైపు లీకేజీ..



పొలంలో పైపు లీకేజీ వల్ల వృథాగా పోతున్న నీరు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు11(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పొలంలో ఉబికి వస్తున్న నీరు సాగు నీటి పైపు నీరు అనుకుంటున్నారా..? కాదు.. మిషన్ భగీరథ పైపు లీకవడం వల్ల నీరంతా పొలంలోకి చేరుతోంది. సోమవారం ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి శివారులోని వ్యవసాయ పొలం మిషన్ భగీరథ నీటిపైపు పగిలిపోయింది. దాంతో తాగునీరు పొలంలో వృథాగా పోయింది. భగీరథ నీరు పొలాల వెంట పరుగులు పెట్టింది. సంబంధిత శాఖ అధికారులు స్పందించి మరమ్మత్తు చర్యలు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ మండల శాఖ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ శాఖ అధ్యక్షుడు బాబు అధ్యక్షతన సోమవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో రాంరెడ్డి, రాములు, శ్రీనివాస్, గోపాల్, జితేందర్, శ్రీపాల్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సాయిరెడ్డి, రాజ్‌కుమార్, రాజు, బాబా తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘంలో అవినీతిపై విచారణ చేపట్టాలి

ఇల్లంతకుంట, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి) :సహకార సంఘంలో జరిగిన అవనీతిపై విచారణ జరపాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గన్నారం నర్సయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలకేంద్రంలోని సహకార సంఘంలో అవనీతి జరిగిందని అనేకసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. సహకార సంఘం ఆధ్వర్యంలో వరిదాన్యం కొనుగోలు కేంద్రాలు నడిచాయని, దీనికి సంఘానికి వచ్చిన కమీషన్, గన్నీబ్యాగుల సమాచారాన్ని చూస్తే మూడు సంవత్సరాల కాలంలో రూ 80లక్షల వరకు గన్నీబ్యాగుల షార్టేజ్ చూపిస్తున్నారని విమర్శించారు. గన్నీబ్యాగులలోనే ఇంత అవినీతి జరిగిందంటే మిగతా విషయాలలో ఏ మేరకు అవినీతి జరిగిందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఉన్నతస్థాయి అధికారులు విచారణ జరిపి దోషుల వద్ద నుంచి సొమ్ము రికవరీ చేయడంతో పాటు శిక్షించాలని కోరారు.

యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలం

ఇల్లంతకుంట, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి) : రైతులకు సరిపడా యూరియాను అందించడంలో ప్రభుత్వం విఫలమైందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహ్మారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతులను కష్టపెట్టే ప్రభుత్వమన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఏనాడు రైతులు యూరియా కోసం ఎదురుచూడలేదన్నారు. ప్రస్తుతం విక్రయకేంద్రాల వద్ద ఉదయం నుంచే నిరీక్షించవలసిన పరిస్థితి ఏర్పడిందన్నారు. క్యూలో పాదరక్షలు పెట్టేపరిస్థితి, పోలీసుల పహారాలో యూరియా పంపిణీ చూస్తుంటే ప్రభుత్వ పరిస్థితిని అర్థం చేసుకోవచ్చన్నారు. రైతులకు మద్దతుగా మంగళవారం మండల కేంద్రంలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అన్ని గ్రామాల రైతులు పాల్గొనాలని కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

చందుర్తి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రమేష్ అన్నారు. చందుర్తి మండలంలోని సనుగుల గ్రామంలో కమ్యూనిటీ కాంట్రాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా సైబర్ నేరాలపై సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొబైల్ ఫోన్‌లకు పంపే ఏపీకే ఫైల్స్ ఓపెన్ చేయవద్దన్నారు. ఓపెన్ చేస్తే పర్సనల్ డేటా దోచుకోవచ్చని హెచ్చరించారు. జాబ్ ఆఫర్లు, లోన్‌ఫ్రాడ్స్, ఇన్వెస్ట్‌మెంట్ స్కీమ్స్ పేరిట మోసాలు జరుగుతున్నాయన్నారు. ఎలాంటి లింకులు, ఫోన్‌కాల్స్‌ను నమ్మవద్దని సూచించారు. మొబైల్ నంబర్ న్యాయస్థానం నుంచి అరెస్ట్ వారెంట్‌కు సంబంధించినది అనే పేరుతో వచ్చేకాల్స్ పూర్తిగా నకిలీవేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు..

తంగళ్లపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నీటిఎద్దడి నివారణకు చర్యలు తీసుకున్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ గడ్డం మధుకర్ తెలిపారు. సోమవారం తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మ కాలనీలో పలు బోరుబావులకు నూతన మోటార్లు ఏర్పాటు చేయడంతో పాటు పాతవాటికి మరమ్మతులు చేయించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లడుతూ గ్రామంలో బోరుబావులలో మోటార్లు మరమ్మతులకు నోచుకోక 5సంవ్సరాలుగా నిరుపయోగంగా ఉండడంతో ప్రజలు నీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జీ కేకే మహేందర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జల్లం ప్రవీణ్ దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే ఉన్నాతాధికారులతో మాట్లడి గ్రామ పంచాయతీ నిధులతో మోటార్లు ఏర్పాటు, మరమ్మతులు చేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గుండ్లపల్లి అనూష, బిట్ల బాలలక్ష్మి, రాయిని రేణుక, రుక్మంబాయి, కవిత, నర్సవ్వ, శ్రీరాం మౌనిక, శ్రీపతి రుక్మిణీ, గాజుల లత, మద్దికుంట లక్ష్మి, ఉమ, సంధ్య, లక్ష్మి, పుష్పలత, శ్యాం, అంజయ్య, లక్ష్మిపతి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి పనులు..

కోనరావుపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో ఉన్న సమస్యలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో పరిష్కరిస్తామని కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య అన్నారు. కోనరావుపేట మార్కెట్ కమిటీ సమావేశాన్ని నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో చైర్మన్ ఎల్లయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ నిజామాబాద్ మార్కెట్ కమిటీలో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సహకారంతో పూర్తి చేస్తామన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, డైరెక్టర్లు నాయిని ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, లింబయ్య, వెంగిలి వెంకన్న, శాసన మల్లేశం, వాళ్య నాయక్, అర్జున్, రామచంద్రం, రాజు, నాగరాజు తదితరులు ఉన్నారు.

గుడుంబా పట్టివేత

వీర్నపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండల అల్మాస్‌పూర్ గ్రామానికి చెందిన ధరావత్ సంగీత అనే మహిళ గర్జనపల్లి నుంచి ఎల్లారెడ్డిపేటకు వెళ్తున్న బస్సులో 10లీటర్ల గుడుంబా తరలిస్తుండగా ఎస్ఐ వేముల లక్ష్మణ్ పోలీస్ సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

చందుర్తి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని నెహ్రూ యువ కేంద్ర ప్రతినిధి గంగిపల్లి స్వామి అన్నారు. చందుర్తి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం మై భారత్ ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ విషయంపై వ్యాసరచన, ఉపన్యాస పోటీ సోమవారం నిర్వహించారు. ప్రిన్సిపల్ విజయలక్ష్మి, అధ్యాపకులు కృష్ణాకర్, పూర్వ విద్యార్థుల సంఘం నాయకులు నాందేడ్ వెంకటేష్, పొంచెట్టి రాకేష్, గుగ్గిళ్ళ సాగర్, మేడిశెట్టి శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.